www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 54 | | 2-8-2026 | | ఆదివారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/-

## కొత్త శిఖరాలకు తెలంగాణ ఆర్థికాభివృద్ధి



- తలసరి ఆదాయం 4.19 లక్షలకు చేరిక
- దేశంలో అగ్రగామి రాష్ట్రాల్లో తెలంగాణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2



## చెరువుల పరిరక్షణతో భావితరాలకు భద్రత

- చెరువుల పునరుద్ధరణతో మారుతున్న హైదరాబాద్ రూపురేఖలు..
- హైడ్రా పనితీరుపై సీఎం రేవంత్ హర్షం
- ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవనంపై అభినందనలు

.. వివరాలు 2లో



# గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తాం

### శాస్త్రీయ, నిపుణుల సలహాలతోనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణ

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి ▪ ఎస్సారెస్పీ, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల పరిశీలన

### మిడ్ మానేరుకు గోదావరి జలాలు.. ▪ ఎల్లంపల్లి వద్ద ఐదు పంపుల ప్రారంభం

ఉత్తర తెలంగాణలోని రైతులకు గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సీజన్‌లో మొదటిసారిగా గోదావరి ప్రాజెక్టులకు భారీగా వరద ప్రవాహం వస్తున్న నేపథ్యంలో.. శ్రీరామసాగర్ ప్రాజెక్ట్ (ఎస్సారెస్పీ), కడెం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**హైదరాబాద్, ఆగస్టు 1:** ఉత్తర తెలంగాణ రైతులకు గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని సాగునీరు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది గోదావరి నుంచి తొలి భారీ వరద ప్రవాహాలు చేరిన నేపథ్యంలో శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ), కడెం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్లంపల్లి నుంచి ఫ్లడ్

మిగతా 2 లో

## భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే

- రూ.17,912 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శ్రీకారం
- స్వర్ణాంధ్ర విజన్-2047కు కీలక మైలురాయి

4



ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త రన్‌వేగా నిలవబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్--2047 సాకారానికి నేటి రోజు కీలక మైలురాయిగా నిలిచిందని, రూ.17,912 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మరింత వేగం అందుకుంటుందని అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు.



## రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ

- విద్వేషపూరిత ప్రసంగాలపై అసెంబ్లీలో బిల్లు: పొన్నం

2

## సోషల్ మీడియా లేకపోతే..

### ప్రభుత్వాల్లో జవాబుదారీతనం వచ్చేది కాదు

- జెన్‌జీ దెబ్బకు అర్ధరాత్రి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పెట్టాల్సి వచ్చింది
- వాట్సాప్ యూనివర్సిటీ అంకుల్స్ - ఇన్‌స్టాగ్రామ్ పిల్లల మధ్యే పోరాటం
- బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

2



## త్వరలో నామినేటెడ్ పోస్టులు: తుమ్మల

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** తెలంగాణలో నామినేటెడ్ పోస్టుల భర్తీ పక్రియ ప్రారంభమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీఎం నిర్ణయాలకు అనుగుణంగా నియామకాలు జరుగుతాయన్నారు. ఆశావహులు తమ పేర్లను పీసీసీకి పంపాలని సూచించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు త్వరలో చేపడతామన్నారు. వివిధ నామినేటెడ్ పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని, సహకార సంఘాల పాలకవర్గాల పోస్టులను కూడా భర్తీ చేస్తామని పేర్కొన్నారు.



## ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

- పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం
- ఫాస్ట్‌ట్రాక్ విచారణతో భూ అక్రమాల బట్టబయలు
- నిషేధిత జాబితాలో అంగుళం భూమి చేర్చలేదు
- భూముల ధరల సవరణతో ఆదాయం పెరిగింది
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని జరిగిన భూ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామన్నారు.

## పేపర్ లీకేజీ బిల్లుకు చట్టబద్ధత

- పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

2



## గోదావరి జలాలపై తెలంగాణకు అన్యాయం

- నీటిని మళ్లించే ఏపీ కుట్రలు వేగం
- టీఆర్ ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత
- హక్కులను పరిరక్షించాలని సీఎంకు విజ్ఞప్తి

3

## గ్రీన్ కారిడార్‌గా మారిన హైదరాబాద్ మెట్రో

- అవయవ మార్పిడికి గుండె, ఊపిరితిత్తుల వేగవంతమైన తరలింపు
- 25 నిమిషాల్లో 14 కిలోమీటర్లు పూర్తి చేసి ప్రాణం కాపాడిన మెట్రో



## ఉగ్రకుట్ర భగ్నం



- జైషే మహమ్మద్ నెట్‌వర్క్‌లో కీలక పాత్రధారి అరెస్ట్..
- మరో మహిళ అదుపులోకి

4

## క్షమాపణలు కాదు.. కేసుల ఎత్తివేతపై మాట్లాడండి



4

- ప్రధాని మోదీ క్షమాపణలపై అభిజిత్ దీప్కే ప్రశ్నలు

## కొలీజియం నిర్ణయాల్లో పారదర్శకత అవసరం



- కారణాలు వెల్లడించకపోతే ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది
- జస్టిస్ ఉజ్జల్ భుయాన్

4



## రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై
# సెలక్ట్ కమిటీ చర్చ

**విద్వేషపూరిత ప్రసంగాలపై అసెంబ్లీలో బిల్లు: పొన్నం**

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్లో సెలక్ట్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సెలక్ట్ కమిటీ చైర్మన్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఓ నివేదికను సమర్పించే దిశగా ఈ కమిటీ కార్యాచరణ రూపొందించనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు పాల్గొన్నారు. మరోసారి హేట్ బిల్, స్పీచ్ బిల్లు కాపీలను సభ్యులందరికీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ ఇచ్చారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. వారం రోజుల్లో మరోసారి తమ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. వచ్చే సమావేశంలో సభ్యులందరీ నుంచి సూచనలను తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా తమ కమిటీ నివేదిక సిద్ధం చేస్తుందని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలతో పాటు సమాజంలో పేరొందిన వారి సలహాలు తీసుకుంటామని అన్నారు. వ్యక్తుల గౌరవం కాపాడే విధంగా తమ కమిటీ నివేదిక ఉంటుందని వివరించారు. భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# పేపర్ లీకేజీ బిల్లుకు చట్టబద్ధత

**పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1:** దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026' పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం. ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా అనేక ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లు ద్వారా పూర్తిస్థాయిలో పేపర్ లీకేజీలను అరికట్టలేమని ప్ర తిపక్షాలు వ్యాఖ్యానించాయి. అయితే, పేపర్ లీకేజీలను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లే కొత్త బిల్లును రూపొందించామని కేంద్రం సమర్థించుకుంది. గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూ లేదు. కొత్త బిల్లు ప్రకారం ఈ కేసుల విచారణను రెండు నెలల్లో పూర్తి చేయాలి.

## గ్రీన్ కారిడార్‌గా మారిన
# హైదరాబాద్ మెట్రో

**అవయవ మార్పిడికి గుండె, ఊపిరితిత్తుల వేగవంతమైన తరలింపు**

**25 నిమిషాల్లో 14 కిలోమీటర్లు పూర్తి చేసి ప్రాణం కాపాడిన మెట్రో**

**హైదరాబాద్, ఆగస్టు 1:** హైదరాబాద్ మెట్రో రైలు మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. నగర ట్రాఫిక్‌ను అధిగమిస్తూ అవయవ మార్పిడి శస్త్రచికిత్స కోసం దాత నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను అత్యంత వేగంగా గమ్యస్థానానికి చేర్చేందుకు ప్రత్యేక గ్రీన్ కారిడార్‌గా సేవలందించింది. వైద్య బృందాలతో సమన్వయం చేసుకుంటూ కీలక సమయంలో స్పందించిన మెట్రో అధికారులు మరో ప్రాణాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషించారు. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దాత నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి అత్యవసరంగా తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు మార్గంలో ట్రాఫిక్ సమస్యల కారణంగా ఆలస్యమయ్యే అవకాశం ఉండటంతో వైద్యులు హైదరాబాద్ మెట్రో అధికారులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన అధికారులు రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి రసూల్‌పురా వరకు ప్రత్యేక గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేసి అవయవాల రవాణాకు ప్రాధాన్యత కల్పించారు. మార్గమధ్యంలోని 13 మెట్రో స్టేషన్లను దాటుకుంటూ కేవలం 25 నిమిషాల్లోనే సుమారు 14 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేసి గుండె, ఊపిరితిత్తులను సురక్షితంగా కిమ్స్ ఆస్పత్రికి చేర్చారు. అవయవ మార్పిడి చికిత్సలో ప్రతి నిమిషం కీలకమైన నేపథ్యంలో వైద్య బృందాలు, మెట్రో సిబ్బంది పూర్తి సమన్వయంతో వ్యవహరించి ఈ అత్యవసర ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అదే సమయంలో అవయవాల రవాణాలో ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సమయానికి అవయవాలు ఆస్పత్రికి చేరడంతో రోగికి అవయవ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించేందుకు అవకాశం లభించింది. అత్యవసర వైద్య సేవలకు హైదరాబాద్ మెట్రో అందిస్తున్న సహకారంపై వైద్యులు, నగరవాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు. వేగవంతమైన రవాణా సేవలతో పాటు ప్రాణాలను కాపాడే మానవతా కార్యక్రమాల్లోనూ హైదరాబాద్ మెట్రో ముందుంటోందని ఈ ఘటన మరోసారి నిరూపించింది.



# కొత్త శిఖరాలకు తెలంగాణ ఆర్థికాభివృద్ధి

**తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిక**

**సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, ఆగస్ట్ 1:** తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

**పెట్టుబుడులు లక్ష్యంగా సీఎం విదేశీ టూర్**

తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగష్టు 20 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 20 రోజులపాటు వివిధ దేశాల్లో సీఎం పర్యటించనున్నారు. అమెరికా, యూకే సహా మరికొన్ని కీలక దేశాలకు ఆయన వెళ్లనున్నట్టు సమాచారం. అయితే ఆయా దేశాల్లోని కంపెనీల ప్రతినిధులు, అపాయింట్‌మెంట్‌ల నేపథ్యంలో సీఎం టూర్ షెడ్యూల్ ఆగష్టు 20-23 తేదీల మధ్య ఉండవచ్చని కూడా అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం టూర్ ఉండొచ్చని సమాచారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కంపెనీలతో, లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపే అవకాశం ఉంది. అలాగే గతంలో విదేశీ పర్యటనల సంద ర్భంగా పలు అంతర్జాతీయ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో.. ఆయా కంపెనీల ప్రతినిధులతోనూ రేవంత్ భేటీ అయ్యే అవకాశాలున్నాయి. చట్టసభల్లోకి ప్రవేశించే వయసును 21కి తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తీర్మానం చేసేందుకు ఆగష్టు 17-18 తేదీల్లో ఒక రోజు ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక వర్షాకాల సమావేశాలను సెప్టెంబరు మూడో వారంలో వారంపాటు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఆగస్టులో సీఎం విదేశీ పర్యటనకు ప్రాథమిక షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో.. సెప్టెంబరు రెండో వారం వరకు ఆయన తిరిగి రాష్ట్రానికి వస్తారని, మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఉంటాయనే చర్చ సచివాలయంలో జరుగుతోంది.

**చెరువుల పరిరక్షణతో భావితరాలకు భద్రత**

నగరంలోని చెరువుల పునరుద్ధరణతో హైదరాబాద్ రూపురేఖలు మారుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జలవనరులను పరిరక్షిస్తూ నగరానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడంలో హైడ్రా చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమని ఆయన అన్నారు. చెరువుల పునరుజ్జీవనంతో నగరానికి కొత్త అందం చేకూరుతుండటంతో పాటు భావితరాలకు మెరుగైన భవిష్యత్తుకు బాటలు పడుతున్నాయని పేర్కొన్నారు. ఉప్పల్‌లోని నల్ల చెరువు పునరుద్ధరణ పనులను విజయవంతంగా పూర్తి చేయడంలో అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడడం మాత్రమే కాదని, భావితరాల భవిష్యత్తును భద్రపరచడమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి చెరువును కంటికి రెప్పలా సంరక్షించడంతో పాటు ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. నగరంలోని చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పర్యావరణ పరిరక్షణతో పాటు నగర అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.



# గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తాం

మొదటి పేజీ తరువాయి



ఫ్లో కాలువ ద్వారా మిడ్ మానేర్‌కు నీటిని తరలించేందుకు ఐదు పంపులను ప్రారంభించారు. గోదావరి జలాల్లో ఒక్క చుక్క కూడా వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు ఉన్నతాధికారులతో కలిసి ప్రాజెక్టుల్లోకి వస్తున్న వరద ప్రవాహాలు, నీటి నిల్వలు, పంపింగ్ కార్యకలాపాలను ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. నీటి నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా గంట గంటకు పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లి నుంచి తరలిస్తున్న నీటిని "కాళేశ్వరం నీరు"గా ప్రచారం చేయడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టులో భాగమని, ప్రస్తుతం అక్కడికి చేరుతున్నది గోదావరి సహజ ప్రవాహమే తప్ప కాళేశ్వరం బ్యారేజీల నుంచి ఎత్తిపోసిన నీరు కాదని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్, కడెం, నాగార్జునసాగర్, శ్రీశైలం, ఫ్లడ్ ఫ్లో కాలువ వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ రాష్ట్రానికి సమర్థవంతంగా సేవలందిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే 2016 నుంచి 2019 మధ్య నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో 2023 నాటికే తీవ్రమైన నిర్మాణ లోపాలు బయటపడ్డాయని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పూర్తిగా శాస్త్రీయ ప్రమాణాలు, నిపుణుల సూచనల ఆధారంగానే చేపడుతున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సూచనల మేరకే బ్యారేజీల్లో నీటి నిల్వలను నిలిపివేశామని తెలిపారు. జూన్ 30న ఏర్పాటు చేసిన కేంద్ర సాంకేతిక పర్యవేక్షణ కమిటీ మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తోందని, ఐఐటీ బాంబే, ఏఎఫ్‌ఆర్‌వై ఇండియా సంస్థలు పునరుద్ధరణ నమూనాలను సిద్ధం చేస్తున్నాయని చెప్పారు. మరో రెండు నుంచి మూడు నెలల్లో నివేదిక అందనున్నట్లు వెల్లడించారు. పునరుద్ధరణలో భాగంగా డయాఫ్రామ్ వాల్ నిర్మాణం, స్టిల్లింగ్ బేసిన్ విస్తరణ వంటి కీలక పనులు చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు. నమూనాలు ఖరారైన వెంటనే మరమ్మతులు ప్రారంభించి వచ్చే వర్షాకాలానికి ముందే బ్యారేజీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కన్నెపల్లి పంపులను ప్రస్తుతం ప్రారంభించలేని పరిస్థితి ఉందని మంత్రి వివరించారు. అక్కడి నుంచి ఎత్తిపోసే నీటిని అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నిల్వ చేయాల్సి ఉంటుందని, ఆయా బ్యారేజీల నిర్మాణ భద్రతపై నిపుణుల పరిశీలన కొనసాగుతున్నందున ప్రస్తుతం పంపింగ్ సాధ్యం కాదని చెప్పారు. అసలు డీపీఆర్‌కు విరుద్ధంగా సెకెంట్ పైల్ ఫౌండేషన్ నిర్మాణంలో లోపాలు జరిగినట్లు నిపుణులు గుర్తించారని వెల్లడించారు. గోదావరి జలాలపై కొందరు రాజకీయ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటికి ఇతరులు క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ కొత్తగా సాగునీటి విస్తీర్ణం ఆశించిన స్థాయిలో పెరగలేదని, కాళేశ్వరం ద్వారా లక్ష ఎకరాలకు కూడా స్థిరమైన సాగునీరు అందలేదని అన్నారు. పాలమూరు--రంగారెడ్డి వంటి పలు ప్రాజెక్టులు కూడా అసంపూర్తిగా మిగిలిపోయాయని విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం ఏటా దాదాపు 300 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి నమోదవుతోందని, ఇటీవల 152 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. దెబ్బతిన్న బ్యారేజీల నీటిని వినియోగించకుండానే ఈ రికార్డు స్థాయి ఉత్పత్తి సాధ్యమైందని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే సుమారు రూ.80 వేల కోట్లు జమ చేశామని గుర్తుచేశారు. ఉత్తర తెలంగాణ రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాగునీరు, తాగునీరు, వ్యవసాయ అవసరాల కోసం గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

- పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం
- ఫాస్ట్‌ట్రాక్ విచారణతో భూ అక్రమాల బట్టబయలు
- నిషేధిత జాబితాలో అంగుళం భూమి చేర్చలేదు
- భూముల ధరల సవరణతో ఆదాయం పెరిగింది
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 1:** ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని జరిగిన భూ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన మంత్రి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా సమగ్రంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరింది, దానిని ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు, అనంతరం ఎందుకు తొలగించారు అనే అంశాలన్నింటినీ ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలిస్తోందని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో విచారిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధిత జాబితాలో కొత్తగా ఒక్క అంగుళం భూమిని కూడా చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఇప్పటికే ఉన్న నిషేధిత జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీ-సర్వే చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక 'భూధార్' నంబర్ కేటాయించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి వినియోగంపై త్వరలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం అధ్యయనం చేస్తోందన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌పై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీరు కారుతున్న ఘటనలు వారి నాణ్యతకు నిదర్శనమని విమర్శించారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా ప్రభుత్వం మరమ్మతు చేయిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే బిల్లులు చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. భూముల మార్కెట్ విలువల సవరణతో ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి వెల్లడించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగిందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో సుమారు రూ.13 వేల కోట్లుగా ఉన్న వార్షిక ఆదాయం గత ఏడాది రూ.15 వేల కోట్లకు చేరిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది రూ.18 వేల కోట్లకు చేరే అవకాశం ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్ పత్రాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# సోషల్ మీడియా లేకపోతే..

## ప్రభుత్వాల్లో జవాబుదారీతనం వచ్చేది కాదు

- జెన్‌జీ దెబ్బకు అర్ధరాత్రి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పెట్టాల్సి వచ్చింది
- వాట్సాప్ యూనివర్సిటీ అంకుల్స్.. ఇన్‌స్టాగ్రామ్ పిల్లల మధ్యే పోరాటం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 1:** జెన్‌జీ యువత ఆందోళనల ప్రభావంతోనే ప్రధాని నరేంద్ర మోదీ అర్ధరాత్రి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేయాల్సి వచ్చిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇటీవల నీట్ స్కాంకు సంబంధించి యువత చేపట్టిన ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ, ఇది కొత్త తరం ఆలోచనలకు ప్రతిబింబమని అన్నారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 'రాజ్యాంగం – ప్రజాస్వామ్యం -- పత్రికా స్వేచ్ఛ' అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. యువతరం ఢిల్లీ వీధుల్లో చేపట్టిన ఉద్యమాన్ని తొలుత ఎవరూ నమ్మలేదని, అయితే ఆ ఆందోళనతో ప్రభుత్వం మాత్రమే కాకుండా మీడియా కూడా కుదేలైందని కేటీఆర్ అన్నారు. ముఖ్యంగా అధికార అనుకూల మీడియా పూర్తిగా ఇబ్బందుల్లో పడిందని, ఆందోళన చేస్తున్న విద్యార్థులు నేరుగా మీడియాను ప్రశ్నించిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ఈ యువతను ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ వంటి సంస్థలతో భయపెట్టడం సాధ్యం కాదని, అందుకే ప్రధాని మోదీ ఎవరితో పెట్టుకోవద్దో వారితోనే పెట్టుకున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన ఉద్యమం "వాట్సాప్ యూనివర్సిటీ అంకుల్స్"కు, "ఇన్‌స్టాగ్రామ్ పిల్లలకు" మధ్య జరిగిన పోరాటమని, తొలి రౌండ్‌లో ఎవరు గెలిచారో దేశ ప్రజలందరూ చూశారని అన్నారు. జెన్‌జీ ఒత్తిడి కారణంగానే ప్రధాని మోదీ అర్ధరాత్రి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేయాల్సి వచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌పై చర్చ జరుగుతోందని, అయితే దానికి హద్దులు ఎవరు నిర్ణయిస్తారనే ప్రశ్నను లేవనెత్తారు. ప్రభుత్వాలే ఆ పరిమితులను నిర్ణయిస్తే భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. సంప్రదాయ మీడియాను ప్రభుత్వాలు ప్రభావితం చేసే పరిస్థితి ఏర్పడిందని, కొన్నిసార్లు పాజిటివ్, మరికొన్నిసార్లు నెగెటివ్ వార్తలు రాస్తున్నా ప్రకటనలు నిలిపివేయవద్దని మీడియా సంస్థలు కోరాల్సిన పరిస్థితి వచ్చిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. స్వేచ్ఛకు పరిమితులు విధిస్తే అది నిజమైన వాక్ స్వాతంత్ర్యం కాదని అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ అంటే దూషణలు చేయడం కాదని, అదే సమయంలో ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కును కూడా హరించకూడదని కేటీఆర్ స్పష్టం చేశారు. నేటి పరిస్థితుల్లో సోషల్ మీడియా లేకపోయి ఉంటే ప్రభుత్వాల్లో జవాబుదారీతనం, స్పందన కనిపించేవి కాదని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు.

# పప్పు, పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలి: గవర్నర్

- దిగుమతుల భారం తగ్గించేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం
- ఎల్‌నినో నిపుణుల కమిటీ నివేదికను స్వీకరించిన గవర్నర్
- హార్టికల్చర్ అభివృద్ధి చర్యలను ప్రశంసించిన శివ ప్రతాప్ శుక్ల
- వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని సూచన



**హైదరాబాద్, ఆగస్టు 1:** దేశంలో పప్పు దినుసులు, వంటనూనెల కొరతను అధిగమించేందుకు పప్పు పంటలు, పామాయిల్ సాగుపై మరింత దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సూచించారు. దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించేందుకు ఈ పంటల సాగును విస్తరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. లోక్ భవన్‌లో శనివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ఎల్‌నినో ప్రభావంపై నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా గవర్నర్‌ను కలిసి ఎల్‌నినో ప్రభావంపై రూపొందించిన నిపుణుల కమిటీ నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయం, అనుబంధ రంగాలపై గవర్నర్ వారితో విస్తృతంగా చర్చించారు. దేశంలో పప్పు దినుసుల ఉత్పత్తి అవసరాలకు సరిపోకపోవడంతో భారీ మొత్తంలో విదేశాల నుంచి దిగుమతులు చేసుకోవాల్సి వస్తోందని గవర్నర్ తెలిపారు. పప్పు దినుసుల దిగుమతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. అదే విధంగా వంటనూనెల అవసరాల కోసం కూడా భారీగా విదేశాలపై ఆధారపడుతున్న పరిస్థితిని తగ్గించాలంటే ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. పప్పు దినుసులు, పామాయిల్ సాగు పెరిగితే రాష్ట్రంతో పాటు దేశ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉద్యానవన పంటలు, కూరగాయల సాగు అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సానుకూల ఫలితాలు ఇస్తున్నాయని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులు సమగ్రంగా ఉన్నాయని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రశంసించారు. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే విలువైన సూచనలను అందించిన కమిటీ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డితో పాటు సభ్యులను అభినందించారు.

# స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు చేయడం కాదు

- సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ముఖ్యమే
- చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి
- జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్య
- దోవల్‌కు అమిత్ షా చేతుల మీదుగా తిలక్ జాతీయ పురస్కారం అందచేత

**ముంబై,ఆగస్ట్1 :** ఇటీవల దేశంలో యువత చేపట్టిన నిరసనలపై జాతీయ భద్రతా సలహాదారు, ఇండియన్ జేమ్స్ బాండ్ అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛ అంటే ఇష్టమొచ్చింది చేయడం కాదని యువతకు చురకలటించారు. స్వేచ్ఛతో పాటు సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ఉంటాయని యువత గుర్తుంచుకోవాలని హితవు పలికారు. స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు చట్టబద్ధమైన పరిధిలోనే ఉండాలని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యంలో శాంతిభద్రతలను కాపాడటం, చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి అని గుర్తు చేశారు. స్వేచ్ఛను ఇష్టానుసారంగా ఏమైనా చేసే అనియంత్రిత హక్కుగా భావించవద్దని యువతను హెచ్చరించారు. దేశ భద్రత, ఇంటెలిజెన్స్ రంగాలలో చేసిన అసమాన సేవలకు గాను అజిత్ దోవల్ ప్రతిష్టాత్మక లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం మహారాష్ట్రలోని పుణెలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా దోవల్ ఈ అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు లోక్‌మాన్య బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఉద్యమకారులు చేసిన త్యాగాలను యువ భారతీయులు స్మరించుకోవాలని సూచించారు. భారతదేశ జాతీయ చైతన్యాన్ని తీర్చిదిద్దడంలో తిలక్ పోషించిన పాత్ర.. ఆయన జీవితం నుంచి యువతరం స్ఫూర్తి పొందాలని కోరారు. నీట్ యూజీ 2026 క్వశ్చన్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చలో పార్లమెంట్?కు పిలుపునిచ్చింది. అఅయితే, ఈ చలో పార్లమెంట్ కార్యక్రమం తీవ్ర హింసాత్మకంగా మారింది. యువత నిరసనలను అణిచివేసేందుకు పోలీసులు దమనకాండ కొనసాగించారు. యువతపై లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్, పె÷–లలెట్ గన్స్ ఉపయోగించారు. కొన్ని చోట్ల పోలీసుల బలప్రయోగంపై యువత తిరగబడ్డారు. దీంతో సీజేపీ తలపెట్టిన చలో పార్లమెంట్ తీవ్ర హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్షాలు కూడా విద్యార్థుల దాడిని తీవ్రంగా ఖండించాయి. యువత, ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి పెరగడంతో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మరో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తాత్కాలికంగా విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు.








# అయోధ్య స్కిట్ వివాదం

## రాహుల్‌గాంధీ సహా పలువురిపై కేసు

**పార్లమెంట్‌లో నిర్వహించిన నిరసనపై సాధు సమాజం అభ్యంతరం**

**సనాతన ధర్మాన్ని అవమానించారంటూ పోలీసులకు ఫిర్యాదు**

**వారణాసి, ఆగస్టు 1:** అయోధ్య రామమందిర విరాళాల అంశంపై పార్లమెంట్ ఆవం-ణలో ప్రతిపక్ష సభ్యులు ప్రదర్శించిన స్కిట్ వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ పప్పు యాదవ్, అవధేశ్ ప్రసాద్ సహా పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సనాతన ధర్మాన్ని అవమానించేలా స్కిట్ నిర్వహించారని సాధు సమాజం చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఇండియా కూటమి ఎంపీలు అయోధ్య రామమందిర విరాళాల సేకరణలో అవకతవకలు జరిగాయంటూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పూర్ణియా ఎంపీ పప్పు యాదవ్ కాషాయ వస్త్రాలు ధరించి ఆలయ పూజారి పాత్రలో స్కిట్ ప్రదర్శించారు. శ్రీరాముడి చిత్రాన్ని చేతిలో పట్టుకుని భక్తుల నుంచి విరాళాలు స్వీకరిస్తున్నట్లు నటించడం వివాదానికి కేంద్రబిందువైంది. ఈ ప్రదర్శన హిందూ మత విశ్వాసాలను, సనాతన ధర్మాన్ని కించపరిచేలా ఉందని సాధు సమాజం ప్రతినిధులు ఆరోపించారు. ఇలాంటి చర్యలను సహించబోమని హెచ్చరిస్తూ వారణాసిలోని కోత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలను కూడా ఫిర్యాదుకు జత చేసినట్లు సమాచారం. ఫిర్యాదు అందిన విషయాన్ని కాశీ జోన్ పోలీసులు ధ్రువీకరించారు. అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. దర్యాప్తు పూర్తయ్యాక కేసులో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. మరోవైపు, పార్లమెంట్ నిరసన సందర్భంగా రామమందిర విరాళాల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో నమోదైన కేసు రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. దర్యాప్తు పురోగతితో పాటు సంబంధిత నేతల స్పందనపై ఆసక్తి నెలకొంది.

# గోదావరి జలాలపై తెలంగాణకు అన్యాయం

## నీటిని మళ్లించే ఏపీ కుట్రలు వేగం

**టీఆర్ ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత**

**తెలంగాణ హక్కులను పరిరక్షించాలని సీఎంకు విజ్ఞప్తి**



**హైదరాబాద్, ఆగస్టు 1:** గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తోందని టీఆర్ ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాష్ట్ర విభజన అనంతరం గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను అడ్డుకునేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో గోదావరి జలాలను మళ్లించే ప్రయత్నాలు మరింత వేగం పుంజుకున్నాయని ఆమె ఆరోపించారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) కూడా ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాల ఆధారంగా తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను ప్రశ్నిస్తూ ఫిర్యాదులు చేయడం ద్వారా తెలంగాణకు అన్యాయం జరిగే పరిస్థితులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. గోదావరి నదిలో తెలంగాణకు 964 టీఎంసీల నీటిపై హక్కు ఉందని, ట్రిబ్యునల్ రక్షణ కలిగిన కేటాయింపులను చెల్లవని పేర్కొంటూ తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోరడం రాష్ట్ర హక్కులను కాలరాయడమేనని కవిత అన్నారు. గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే అప్రమత్తం కావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వకుండా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కవిత హెచ్చరించారు.

# గ్రూప్ నోటిఫికేషన్ రాకపోవడంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

**ఖమ్మం, ఆగస్ట్ 1:** గ్రూప్స్ నోటిఫికేషన్ రావడం లేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ముదిగొండ మండలంలో కలకలం రేపింది. యువతకు ఉద్యోగాలు హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కాలయాపన చేస్తుండడంతో విసిగిపోయిన న్యూ లక్ష్మీపురంవాసి గడ్డం వేణు కుమార్ ఎలుకల మందు, ఇతర మాత్రలు తీసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం ఐసీయూలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అతడు తాను ఎందుకు ఆత్మహత్యకు ప్రయత్నించాడో సూసైడ్ లేఖలో వెల్లడించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ముత్తారం శివారులోని ప్లలె చెరువులోని మిషన్ భగీరథ ప్లాంట్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న వేణు కుమార్ పీజీ వరకూ చదివాడు. గత అయిదేళ్లుగా గ్రూప్స్ కోసం ప్రిపేర్ అవుతున్నాడు. ప్రతి రోజు ప్లాంట్ వద్దకు వెళ్లి.. పని చూసుకుంటూ.. అక్కడే చదువుకుని సాయంత్రం ఇంటికి వస్తాడు. రోజులానే శనివారం కూడా ఇంట్లో నుంచి వెళ్లాడు. అయితే.. సాయంత్రం సమయంలో నిరుద్యోగుల వాట్సాప్ గ్రూప్‌లో సూసైట్ నోట్ పోస్ట్ చేసి అతడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రూపులో ఉన్నవారు అప్రమత్తమై వెంటనే అతడి తండ్రికి సమాచారం ఇవ్వగా.. వెళ్లి చూసేసరికి వేణు అపస్మారక స్థితిలో ఉన్నాడు. హుటాహుటిన అతడిని వైద్య చికిత్స నిమిత్తం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వేణు ఆత్మహత్యకు ప్రయత్నించిన చోట ఎలకల మందు, గుర్తు తెలియని మాత్రలను గుర్తించారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్న వేణు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. గ్రూప్ నోటిఫికేషన్ ఇవ్వడంలేదని మనస్తాపానికి గురై తను ఆత్మహత్యాయత్నం చేశానని సూసైడ్ లేఖలో వేణు కుమార్ వెల్లడించాడు.

## సంపాదకీయం




# ఉత్తరాంధ్రకు మణిహారం... భోగాపురం!

### అభివృద్ధికి కొత్త ద్వారం తెరిచిన అంతర్జాతీయ విమానాశ్రయం

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలసి వచ్చే అంశం. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమిలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడుతుంది. ఎపిలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోడీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్ర కు గేట్‌వేను తెరిచారు. అమరావతలి రాజధాని నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హచయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్ధిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయా నికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉండడ, ఉ త్తరాంధ్రకు కూడా కలసి వచ్చే అంశం. విశ్వాఖ పూర్తిస్తాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందుకే ఎపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళ్లు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఎలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించయుకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సిఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండోదఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుంది. ఇలా చరిత్రలో 2026 ఆగస్టు 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్టే! మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది. ఈ ఆలోచనా సరళితోనే కూటమి ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది. నిజానికి ఇది 2019లోపే పూర్తయి వుంటే పరిస్తితి మరోలా ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ మౌలిక వసతుల విప్లవంలో భోగాపురం ప్రాజెక్టు ఒక మచ్చుతునక! జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానం ద్వారా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఇది మరో చరిత్రాత్మక విజయం. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భోగాపురం అనేది కేవలం ఒక కనెక్టివిటీ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసానికి, సరికొత్త అవకాశాలకు, ఉన్నత ఆశయాలకు సంకేతం. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌కు, పారిశ్రామిక ఆవిష్కరణలకు ఉత్తరాంధ్ర ఇప్పుడు చిరునామాగా నిలవనుంది. 2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాజెక్టు మళ్లీ శరవేగంగా పట్టాలెక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించగా, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రాత్రింబవళ్లు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.4,700 కోట్ల భారీ వ్యయంతో 2,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే అత్యంత ఆధునిక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో ఒకటి. ఇక్కడ నిర్మించిన 3.8 కిలోమీటర్ల సుదీర్ఘ 'కోడ్ 4ఈ' రన్‌వే ద్వారా భారీ అంతర్జాతీయ విమానాలు కూడా సునాయాసంగా ల్యాండ్ అవుతాయి. ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి ర ఆవడంతో ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే

- రూ.17,912 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శ్రీకారం
- స్వర్ణాంధ్ర విజన్-2047కు కీలక మైలురాయి



**విజయనగరం, ఆగస్టు 1:** ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త రన్‌వేగా నిలవబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్--2047 సాకారానికి నేటి రోజు కీలక మైలురాయిగా నిలిచిందని, రూ.17,912 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మరింత వేగం అందుకుంటుందని అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయం కేవలం రవాణా సౌకర్యానికే పరిమితం కాదని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా, రాష్ట్ర యువత భవిష్యత్తుకు కొత్త లాంచ్‌ప్యాడ్‌గా నిలుస్తుందని ప్రధాని అభివర్ణించారు. కొత్త విమానాశ్రయం, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను పెంచి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేస్తాయని చెప్పారు. ప్రారంభోత్సవానికి ముందు 13 వేల మంది గిరిజన మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యం తనను ఎంతగానో ఆకట్టుకుందని, అభివృద్ధిలోనే కాకుండా సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటడంలోనూ ఆంధ్రప్రదేశ్ కొత్త చరిత్ర సృష్టించిందని కొనియాడారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టికి మరో నిదర్శనమని వ్యాఖ్యానించారు. దేశంలో విమానయాన రంగంలో గత దశాబ్దంలో జరిగిన మార్పులను వివరిస్తూ, 2014కు ముందు దేశంలో కేవలం 74 విమానాశ్రయాలు మాత్రమే ఉండగా, గత 12 ఏళ్లలో మరో 166 కొత్త విమానాశ్రయాలను నిర్మించామని ప్రధాని తెలిపారు. ఉడాన్ పథకం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు కూడా విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని, ఒకప్పుడు కలగా భావించిన విమాన ప్రయాణాన్ని సామాన్య ప్రజల హక్కుగా మార్చామని పేర్కొన్నారు. గతంలో విమానాశ్రయాలకు కొద్దిమంది కుటుంబాల పేర్లు మాత్రమే పెట్టేవారని, ప్రస్తుతం అయోధ్య విమానాశ్రయానికి మహర్షి వాల్మీకి, పంజాబ్‌లో సంత్ రవిదాస్, భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టి మహనీయులకు గౌరవం అందిస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలక పారిశ్రామిక, తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని ప్రధాని స్పష్టం చేశారు. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు పోర్టుల అభివృద్ధి, కొత్త పోర్టుల నిర్మాణం, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వే ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన రైల్వే ప్రాజెక్టులు అమలవుతున్నాయని, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో భారీ పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ వేగంగా మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా రూపుదిద్దుకుంటోందని కొనియాడారు. ఈ సందర్భంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు విశాఖపట్నం తర్లువాడలో సెమీకండక్టర్ ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్‌కు శంకుస్థాపన, కర్నూలు జిల్లాలో పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు, విండ్--సోలార్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలు, పలు జాతీయ రహదారి ప్రాజెక్టులు, తాడిపత్రి నాలుగు లేన్ల బైపాస్, ఇతర మౌలిక సదుపాయాల పనులకు ప్రధాని వర్చువల్‌గా శ్రీకారం చుట్టారు. మొత్తం రూ.17,912 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊపు తీసుకురానున్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉగ్రకుట్ర భగ్నం

### జైషే మహమ్మద్ నెట్‌వర్క్‌లో కీలక పాత్రధారి అరెస్ట్..

### మరో మహిళ అదుపులోకి



**కొల్‌కతా, ఆగస్టు 1:** పశ్చిమ బెంగాల్ పోలీసులు మరో ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. ఇటీవల అరెస్టైన జైషే మహమ్మద్ అనుమానిత ఉగ్రవాది మహమ్మద్ హమీమ్ మోండల్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హమీమ్‌కు సన్నిహితురాలిగా భావిస్తున్న అర్పిత సర్కార్‌ను ప్రత్యేక టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) అధికారులు జార్ఖండ్‌లోని సాహెబ్‌గంజ్‌లో శుక్రవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను విచారణ నిమిత్తం పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌కు తరలించారు. గురువారం బర్ధమాన్‌లోని ఓ ఇంట్లో మహమ్మద్ హమీమ్ మోండల్‌ను ఎస్టీఎఫ్ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రాథమిక దర్యాప్తులో అతడు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్‌ఐ మద్దతుతో పనిచేస్తున్న జైషే మహమ్మద్ ఉగ్ర నెట్‌వర్క్‌లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పశ్చిమ బెంగాల్‌లోని ప్రముఖ రాజకీయ నాయకులు, ముఖ్యంగా బీజేపీ నేతలు, ఇతర ప్రముఖుల వ్యక్తిగత వివరాలను సేకరించడం, కొత్త సభ్యులను చేర్చుకోవడం, రాష్ట్రంలో ఉగ్ర కార్యకలాపాలకు ప్రణాళికలు సిద్ధం చేయడం ఈ నెట్‌వర్క్ లక్ష్యంగా ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. విచారణలో భాగంగా హమీమ్ మోండల్, అర్పిత సర్కార్ మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలను అధికారులు పరిశీలించారు. రాజకీయ నాయకులతో పరిచయాలు పెంచుకోవడం, వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేందుకు హమీమ్ అర్పితను ఉపయోగించినట్లు ఎస్టీఎఫ్ అనుమానిస్తోంది. ఇద్దరినీ ప్రస్తుతం విస్తృతంగా విచారిస్తున్న పోలీసులు, ఈ ఉగ్ర నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్న మరికొందరిని గుర్తించేందుకు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. అధికారులు స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాలను కూడా క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు.



# క్షమాపణలు కాదు.. కేసుల ఎత్తివేతపై మాట్లాడండి

### ప్రధాని మోడీ క్షమాపణలపై అభిజిత్ దీప్కే ప్రశ్నలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 1:** విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రీల్‌లో మాత్రమే క్షమిస్తారా? లేక విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకుంటారా?' అంటూ ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో, కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు. తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. వీడియోపై స్పందించిన అభిజీత్ దిప్కే, 'క్షమించామని చెప్పడం సరిపోదు. విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?' అని ప్రశ్నించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఒక కెమెరామెన్‌పై అనుచిత పదజాలం ఉపయోగించిన వీడియోను ప్రస్తావిస్తూ, 'ఈ దేశంలో రెండు రకాల చట్టాలా? యువతకు ఒకటి, అధికార పార్టీకి మరొకటా?' అని విమర్శించారు. కాగా, ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలతో నోయిడాకు చెందిన ఓ బాలికపై కేసు నమోదైంది (ఏజీనిబిజీస ఓజీనిబిజీస ÷ఔసనీబి।బబి). తాజాగా ఆమె వీడియో విడుదల చేసి దేశ ప్రజలకు, ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పింది. తాను చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. కాగా, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# కొలీజియం నిర్ణయాల్లో పారదర్శకత అవసరం

- కారణాలు వెల్లడించకపోతే ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది
- జస్టిస్ ఉజ్జల్ భుయాన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 1:** న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన కొలీజియం వ్యవస్థ నిర్ణయాల్లో మరింత పారదర్శకత అవసరమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అభిప్రాయపడ్డారు. కొలీజియం తీసుకునే నిర్ణయాల వెనుక ఉన్న కారణాలను బహిరంగంగా వెల్లడించకపోవడం న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. సమర్థులైన వ్యక్తులకు అన్యాయం జరగడంతో పాటు, అర్హత లేని వారు న్యాయవ్యవస్థలోకి ప్రవేశించే అవకాశం కూడా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఢిల్లీలో విధి థింక్-ట్యాంక్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ భుయాన్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో కోర్టులు ఎలా పనిచేస్తున్నాయి, న్యాయమూర్తులు ఎవరు, వారు ఎలాంటి తీర్పులు ఇస్తున్నారు అనే విషయాలు తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. ప్లేటో నుంచి బెంతమ్ వరకు పలువురు తత్వవేత్తలు కూడా ఇదే సూత్రాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు. న్యాయవ్యవస్థకు సంబంధించిన సమాచారం ప్రజలకు అందుబాటులో ఉ ఒడటం పారదర్శక పాలనకు అవసరమని చెప్పారు. 2023లో న్యాయవాది సౌరభ్ కిర్పాల్‌ను ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా సిఫార్సు చేసిన సందర్భంగా కొలీజియం తన నిర్ణయానికి సంబంధించిన కారణాలను స్పష్టంగా వెల్లడించిందని జస్టిస్ భుయాన్ పేర్కొన్నారు. అయితే, ఆ సిఫార్సు చేసిన మూడేళ్లు గడిచినా ఆయన నియామకం ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటం ఆందోళనకరమని అన్నారు. నిర్ణయాల వెనుక కారణాలను వెల్లడించకపోవడం వల్ల అర్హులైన, నిజాయితీ గల న్యాయమూర్తులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే, సరైన పరిశీలన లేకుండా అర్హత లేని వ్యక్తులు న్యాయవ్యవస్థలోకి వస్తే, భవిష్యత్తులో రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే లేదా సమాజంలోని వర్గాలపై అనుచిత వ్యాఖ్యలు చేసే పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ హెచ్చరించారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయాలంటే కొలీజియం వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.



# తండా పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించండి

**తహశీల్దార్ మాణిక్ రావుకు సామాజిక కార్యకర్త సోనాక్షి వినతి**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలో గల చౌడవరం తండాలో సామాజిక యువ ఉద్యమకారిణి వడిత్యా సోనాక్షి శనివారం గడప గడపకు తిరిగి సమస్యలపై సర్వే చేశారు. అక్కడ నివసిస్తున్న 70 కుటుంబాలకు చెందిన మైదాన ప్రాంత గిరిజన పేదలకు ఇండ్ల పట్టాలు లేవని, మా తండా పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించండి సారు అంటూ తహశీల్దార్ జె.మాణిక్ రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పాలకులు తమ తండాలో ఇండ్ల పట్టాలు ఇచ్చారని, ఆ స్థలాల్లో కాలక్రమేనా గూడు లేని గిరిజన పేదలు ఇండ్లు నిర్మించుకొని ఉంటున్నారని తెలిపారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు, హక్కు పత్రాలు ఇప్పించాలని కోరారు. అంతే కాకుండా కల్లూరు సబ్ కలెక్టర్, జిల్లా కలక్టర్ లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అప్పటికి పట్టాలు, హక్కుపత్రాలు ఇవ్వకుంటే హైదరాబాద్ లోని సీసీఎల్ఏ, ఎస్టీ కమీషన్ ను సంప్రదిస్తామని స్పష్టం చేశారు.

# రాష్ట్ర స్థాయి సీడీఎంఏ శిక్షణలో మున్సిపల్ కౌన్సిలర్లు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల కౌన్సిలర్ల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీడీఎంఏ శిక్షణ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన 28వ వార్డు కౌన్సిలర్ ఈర్ల విశ్వేశ్వరరావు, 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య లక్ష్మణ్, 7వ వార్డు కౌన్సిలర్ కమల పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ పాలనలో ప్రజాప్రతినిధుల పాత్ర, కౌన్సిలర్ల బాధ్యతలు, అభివృద్ధి పనుల సమర్థ వంతమైన అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పరిపాలన, స్థానిక సంస్థల పనితీరు మెరుగుదల వంటి కీలక అంశాలపై అధికారులు శిక్షణ అందించారు. స్థానిక సంస్థల పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో వేగం పెంచడం, ప్రజా అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలపై కౌన్సిలర్లకు వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వర్తించడంతో పాటు స్థానిక సంస్థల అభివృద్ధికి కీలకంగా దోహదపడతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పట్టణాభివృద్ధి కార్యక్రమాల అమలులో కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.

# అన్నాభావు సాఠే ఆశయాలను కొనసాగిద్దాం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** దళిత సాహిత్య వ్యవస్థాపక పితామహుడు, మహనీయుడు అన్నాభావు సాఠే ఆశయాలను కొనసాగిద్దామని సర్పంచ్ ఆడే శీల పిలుపునిచ్చారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో అన్నభావు సాఠే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ మొదట కమ్యూనిస్టు ఉద్యమంలో అడుగులు వేసి, అనంతరం బీఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలకు ఆకర్షితుడై దళితుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు అన్నాభావు సాఠే అని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ ఆదర్శప్రాయమని అన్నారు. సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన అన్నాభావు సాఠే ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని, యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవలో ముందుండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొ న్నారు.

# గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- **ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరందు**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు పిలుపునిచ్చారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ మరియు మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన 5 రోజుల శిక్షణా కార్యక్రమ ముగింపు సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు కాలాను గుణంగా తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. శిక్షణా కార్యక్రమాలలో పొందిన విజ్ఞానాన్ని ఆచరణలోకి తీసుకువచ్చి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీసేలా బోధించాలని స్పష్టం చేశారు. విద్యార్థులలో పఠనం, రచన, గణిత నైపుణ్యాలతో పాటు విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించే విధంగా బోధనా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ విద్యా ప్రమాణాల పెంపు కోసం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ప్రతి ఉపాధ్యాయుడు విజయవంతం చేయాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులకు సబ్జెక్టు పరిజ్ఞానంతో పాటు సమర్థవంతమైన బోధనా నైపుణ్యాలు, విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసే విధానాలు, నూతన విద్యా పద్ధతులపై సమగ్ర అవగాహన కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జాదవ్ అంబాజీ, ఉప విద్యాధికారి గోడం చందన్, పి.ఎం.ఆర్.సి. ఏపీఎంఓ పూర్క ఉద్ధవ్, మంచిర్యాల ఏపీఎంఓ లక్ష్మయ్య, జీసీడీఓ కొట్నాక శకుంతల, జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు, కోర్సు డైరెక్టర్ కోడెం రవీందర్, ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు, శిక్షణ సమన్వయకర్తలు, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అసిఫాబాద్‌లో పారిశుద్ధ్య పరిరక్షణే లక్ష్యం

**మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎం.డి. అహ్మద్**





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** పట్టణంలో పారిశుద్ధ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎం.డి. అహ్మద్ స్పష్టం చేశారు. పట్టణంలోని 17వ వార్డులో శనివారం మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన స్వయంగా పరిశీలించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని ప్రధాన డ్రైనేజీల్లో పూడికను తొలగించడంతో పాటు, రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ నివాసులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వార్డుల వారీగా పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేస్తున్నామన్నారు. డ్రైనేజీల్లో మురుగు నీరు నిలవకుండా క్రమం తప్పకుండా పూడికతీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను మున్సిపల్ వాహనాల్లో వేస్తూ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు నాయకులు పాల్గొన్నారు.

# తల్లి పాలే శిశువుకు సంపూర్ణ రక్షణ

**జిల్లా కలెక్టర్ హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు – 2026 సందర్భంగా "సుస్థిర జీవిత ప్రారంభానికి తల్లిపాలు సత్ఫలితాలనిచ్చే విధానాలను బలోపేతం చేద్దాం" అనే నినాదంతో రూపొందించిన ప్రత్యేక అవగాహన పోస్టర్ లు జిల్లా కలెక్టర్ హరిత శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాలే శిశువుకు సంపూర్ణ రక్షణ అని పేర్కొన్నారు. బిడ్డ జన్మించిన మొదటి గంటలోనే ముర్రుపాలు పట్టించడం అత్యంత ఆవశ్యకమని, శిశువుకు మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత తగిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలు కొనసాగించడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదుగుతారని వివరించారు. గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన జీవితానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆహారమని, తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని తెలిపారు. పోషణ్ అభియాన్, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7 వరకు జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు, గర్భిణులు–బాలింతల సమావేశాలు, ఇంటింటి సందర్శనలు మరియు సలహా సూచనల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోషణ్ అభియాన్ బృందం, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు తదితరులు పాల్గొ న్నారు.




# ప్రతి కార్మికుడు నమోదు చేసుకోవాలి

**అసిస్టెంట్ లేబర్ అధికారి దుర్గం క్రాంతి**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రతి కార్మికుడు కార్మిక శాఖలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ అధికారి దుర్గం క్రాంతి అన్నారు. జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణం కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో కార్మికులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడు నమోదు చేసుకుని ఉండాలన్నారు. కార్మికుల సంక్షేమ కోసం అన్ని రకాల పథకాలు వర్తించే విధంగా చూస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు నమోదు ప్రక్రియలు చేసుకోవాలని అప్పుడే ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్మికులకు ఎటువంటి సమస్యలు ఉన్న వెంటనే తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ విజయ్ కన్నా, సిస్టం ఆపరేటర్ ఖలీద్, భవన నిర్మాణ కార్మికులు జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, జిల్లా కోశాధికారి ఆనందరావు, మండల అధ్యక్షులు కమలాకర్, ఉపాధ్యక్షులు రామచందర్, కార్యదర్శి నరసయ్య, కోశాధికారి సదయ్య, ఉపాధ్యక్షుడు ఎడ్ల శంకర్, అప్రోచ్, బాలాజీ తదితరులు పాల్గొ న్నారు.



# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ధ్యేయం

- ఆరోగ్య పాఠశాల లక్ష్యాల అమలుతో మరింత నాణ్యమైన విద్య
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పాఠశాలల్లో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టి గా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమం, నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరంలోని 220 పనిదినాల్లో ప్రతి విద్యార్థి కనీసం 200 రోజులు తప్పనిసరిగా పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. క్రమం తప్పకుండా హాజరైతేనే ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలు మెరుగుపడి, పదో తరగతి ఫలితాలు, గురుకుల ప్రవేశాల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెరిగితే, జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ ప్రత్యేక సర్దుబాటుతో అదనపు ఉపాధ్యాయుడిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాల్లో విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించేందుకు మధ్యాహ్నం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలను ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాలగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. త్వరలోనే మధ్యాహ్న భోజనంతో పాటు హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం అందించే బ్లూ యూనిఫాంలను విద్యార్థులకు సరిపోయేలా ఎస్‌హెచ్‌జీ టైలర్ల ద్వారా ఆల్టరేషన్ చేయించాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పాఠశాలలో



ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకా రులు ఆరోగ్య పాఠశాల అంశాలపై పాటలు, ప్రసంగాలు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను కలెక్టర్ శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి, నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారం భించారు. పాఠశాలకు సీసీటీవీలు విరాళంగా అందించిన మౌనీష్, శ్రీకాంత్ సేవలను, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు నవీన్ యాదవ్‌తో పాటు ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాధవి, కౌన్సిలర్లు రజిత, మాన్కర్ నాక్సేన్, ఆరోగ్య పాఠశాల పర్యవేక్షకులు అజయ్, కాంప్లెక్స్ హెచ్ఎం సాధన, ఏఏపీసీ చైర్మన్ రజియా సుల్తానా, దాతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాలనీ వాసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- కాంగ్రెస్ మండల అధ్యక్షులకు సన్మానం



**ఉద్యమ కెరటం, జైనూర్:** పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జైనూర్, సిర్పూర్ (యు) కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నియామకమైన మాజీ వైస్ ఎంపీపీ షేక్ రషీద్, ఆత్రం శంకర్‌లను శనివారం జైనూర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నూతన మండల అధ్యక్షులు సమర్థవంతంగా పనిచేసి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మండల అధ్యక్షుడు షేక్ రషీద్ మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎమ్మెల్యే నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ముఖీద్, మండల సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, సర్పంచ్ చందన్ షావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ రహీం, షేక్ అబ్బు, గంగారాం, మండడి లింగు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసం అన్నాభావ్ సాఠే చూపిన మార్గం ఆదర్శనీయం

- మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సామాజిక న్యాయం, సమానత్వం కోసం సామాజిక విప్లవకారుడు, ప్రముఖ రచయిత అన్నాభావ్ సాఠే చూపిన మార్గం ఆదర్శనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. అన్నభావు సాఠే 106వ జయంతి వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్ట ణంలోని అన్నాభావ్ సాఠే చౌక్‌తో పాటు ఖానాపూర్ కాలనీ అంబేద్కర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అన్నాభావ్ సాఠే చౌక్ వద్ద ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అన్నాభావ్ సాఠే తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన రచనలు, ఆలోచనలు, సందేశాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేటి యువత, విద్యార్థులు అన్నాభావ్ సాఠే జీవిత చరిత్రను చదివి, ఆయన రచనలను అధ్యయనం చేసి, ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోషరావు, ప్రముఖ నాయకులు యూనుస్ అక్బాని, రషీదుల్ హక్, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు, కాలనీ వాసులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# సేంద్రీయ సాగుతో ఆరోగ్యకరమైన జీవన విధానం

- కాగజ్‌నగర్ డిగ్రీ కళాశాలలో కూరగాయల విత్తనాల పంపిణీ




**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** సేంద్రీయ సాగుతో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీదేవి అన్నారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జలజీవిక వాటర్ ఫర్ లైవ్లీహుడ్ సంస్థ సహకారంతో విద్యార్థులకు కిచెన్ గార్డెన్ ఏర్పాటు కోసం కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద చిన్న కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకొని రసాయన రహిత, పోషకాహారంతో కూడిన కూరగాయలను సాగు చేయాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన, పర్యావరణ పరిరక్షణ భావనతో పాటు స్వయం సమృద్ధి జీవన విధానాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జలజీవిక వాటర్ ఫర్ లైవ్లీహుడ్ సంస్థ డైరెక్టర్ పద్మాకర్ మాట్లాడుతూ ఇంటి వద్ద కూరగాయల సాగు ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని, నీటి సంరక్షణ, సేంద్రీయ వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణలో ప్రతి కుటుంబం భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మీనర్సింహం, లెక్చరర్లు శారద, ఆర్.కృష్ణవేణి, బి.రోజ్‌మేరీ, బి.వెంకటేశం పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- ఎస్ఐఆర్ విధుల్లో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించిన బీఎల్ఓకు సన్మానం

**ఉద్యమ కెరటం, తాండూర్:** మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని మాదారం గ్రామపంచాయతీలో శనివారం మహిళల కోసం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ విధుల్లో బీఎల్ఓగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించిన నడిపెల్లి యాదలక్ష్మిని తోటి మహిళలను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను మహిళలు పూర్తిగా వినియోగించుకుని దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళలు ఉన్నత విద్యను అభ్యసించి కుటుంబ అభివృద్ధితో పాటు దేశ ప్రగతికి కృషి చేయాలని అన్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తూ స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలని సూచించారు. మహిళలకు విద్య ఎంతో అవసరమని, దీని ద్వారా లింగ వివక్షత తగ్గడంతో పాటు చట్టపరమైన రక్షణ, భద్రతపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. మహిళలు పొదుపు అలవాట్లు పెంపొందించుకోవడం ద్వారా ఆర్థికంగా బలపడటమే కాకుండా రుణాలు పొందడం, కుటుంబ అవసరాలు తీర్చుకోవడం, ఉపాధి అవకాశాలు సృష్టించుకోవడం సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గొర్లపల్లి బాణేష్, లలిత, పొట్లంచర్ల సౌమ్య, గుండేటి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఉపాధిహామీ మేట్ పుప్పాల పుష్ప, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు తోట పద్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పేరం మాధవి, స్వయం సహాయక సంఘం నాయకురాలు కోళ్ల జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ కుశనపల్లి మీనా, యాదలక్ష్మి, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు భద్రత కొనసాగించాలి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** బహుజన నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ప్రస్తుతం కల్పిస్తున్న పోలీసు భద్రతతో పాటు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని యథావిధిగా కొనసాగించాలని సిర్పూర్ నియోజకవర్గ ఆర్ఎస్పీ టీమ్ నాయకులు కోరారు. శనివారం జిల్లా కలెక్ట రేట్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిరంతరం ప్రజల్లో ఉంటూ సేవలందిస్తున్నారని తెలిపారు. గతంలో ఆయన నిర్వహించిన కీలక బాధ్యతలు, ప్రస్తుతం ప్రజా జీవితంలో పోషిస్తున్న పాత్రను దృష్టిలో ఉంచుకుని ఆయన భద్రత విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా నాయకుడిగా నిరంతరం ప్రజల మధ్య తిరుగుతున్న ఆయనకు ప్రస్తుతం కల్పిస్తున్న పోలీసు భద్రతను ఉపసంహరించకుండా అన్ని భద్రతా ఏర్పాట్లను కొనసాగించాలని కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సోనాలకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు హర్షణీయం



**ఉద్యమ కెరటం, సోనాల:** సోనాల మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం పట్ల ఏఐసీసీ ఇంటెలెక్చువల్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇందుకు సహకరించిన నేతలు వేమ్ నరేందర్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ విద్యాసంస్థ ఏర్పాటుతో గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు బోథ్ నియోజకవర్గ విద్యాభివృద్ధిలో చారిత్రాత్మక ముందడుగు అని పేర్కొన్నారు. ఈ పాఠశాల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు లభించడంతో పాటు, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దోహదపడుతుందని అన్నారు.

# తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష

**రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** బిడ్డకు తల్లిపాలు శ్రీరామరక్ష వంటివని, తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా శనివారం రిమ్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈనెల 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ఈ వారోత్సవాల్లో భాగంగా రిమ్స్ కళాశాల నుంచి కలెక్టర్ చౌక్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “డబ్బా పాలు వద్దు.. తల్లిపాలు ముద్దు” అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. శిశువు జన్మించిన తర్వాత తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. మార్కెట్లో లభించే కృత్రిమ ఆహారాలపై తల్లులు అప్రమత్తంగా ఉండాలని, గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు హేమలత, నివేదిత రెడ్డి, దివ్య జ్యోతి, రిమ్స్ వైద్యులు, వైద్య విద్యార్థులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పిడియాట్రిక్స్ ఆదిలాబాద్ సభ్యులు తిరుమల్ రెడ్డి, సంజయ్ గుజరాతి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసం అన్నభావు సాఠే కృషి చిరస్మరణీయం

**ఉద్యమ కెరటం, జైనూర్:** సామాజిక న్యాయం కోసం అన్నభావు సాఠే కృషి చిరస్మరణీయమని జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు అన్నారు. ప్రముఖ సమాజ సంస్కర్త, విప్లవ రచయిత అన్నభావు సాఠే 106వ జయంతి వేడుకలను శనివారం జైనూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అన్నభావు సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అన్నభావు సాఠే తన రచనలు, పోరాటాల ద్వారా పేద, పీడిత వర్గాల అభ్యున్నతికి, అణగారిన వర్గాల హక్కుల కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షులు మౌలే దత్త, ఆత్రం దత్త, మెస్రం షేకు, ఊర్వేత జంగూ, గుణవంత్ రావు, స్థానిక నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# నీరజ్‌కు రజతం.. యశ్‌వీర్‌కు కాంస్యం

- జావెలిన్ త్రోలో శ్రీలంక అథ్లెట్ పతిరగేకు స్వర్ణం
- ఒకే ఈవెంట్‌లో భారత్ ఖాతాలో రెండు పతకాలు
- వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో యశ్‌వీర్ మెరిసాడు
- డిఫెండింగ్ ఛాంపియన్ అర్షద్ నదీమ్‌కు నిరాశ

**గ్లాస్గో, ఆగస్టు 1**



కామన్వెల్త్ గేమ్స్ 2026 పురుషుల జావెలిన్ త్రోలో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శన చేసినప్పటికీ స్వర్ణాన్ని అందుకోలేకపోయాడు. అదే ఈవెంట్‌లో మరో భారత అథ్లెట్ యశ్‌వీర్ సింగ్ కాంస్య పతకం సాధించడంతో భారత్‌కు ఒకే విభాగంలో రెండు పతకాలు దక్కాయి. ఫైనల్లో నీరజ్ తన రెండో ప్రయత్నంలోనే 85.83 మీటర్లు విసిరి రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. అయితే శ్రీలంకకు చెందిన ఆర్.టి. పతిరగే 89.75 మీటర్లతో సంచలన ప్రదర్శన చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో నీరజ్‌కు కామన్వెల్త్ గేమ్స్‌లో రెండో పతకం లభించింది. 2018 గోల్డ్ కోస్ట్ క్రీడల్లో స్వర్ణం గెలిచిన అతడు, గాయం కారణంగా 2022 పోటీలకు దూరమైన సంగతి తెలిసిందే.

భారత్‌కు చెందిన యశ్‌వీర్ సింగ్ చివరి ప్రయత్నంలో అద్భుతంగా రాణించాడు. ఆరో ప్రయత్నంలో 85.41 మీటర్లు విసిరి తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేస్తూ కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. నీరజ్ మార్కుకు కేవలం 42 సెంటీమీటర్ల దూరంలో నిలిచిన యశ్‌వీర్, చివరి ప్రయత్నంతో పతకాల రేసులోకి దూసుకొచ్చి అందరి ప్రశంసలు అందుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, డిఫెండింగ్ ఛాంపియన్ పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ 77.41 మీటర్లతో తొమ్మిదో స్థానంలో నిలిచి నిరాశపరిచాడు. మరో భారత అథ్లెట్ రోహిత్ యాదవ్ 81.56 మీటర్లతో ఏడో స్థానాన్ని దక్కించుకున్నాడు. నీరజ్, యశ్‌వీర్ సాధించిన పతకాలతో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల వేటను మరింత బలోపేతం చేసింది.

## గాయం భయం వెంటాడినా
## దేశానికి పతకం అందించా: నీరజ్ చోప్రా

- ప్రతి త్రోకు ముందు ఒత్తిడిని ఎదుర్కొన్నానన్న భారత స్టార్
- రజతంతో అంతర్జాతీయ వేదికపై విజయవంతమైన పునరాగమనం
- పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో మరింత మెరుగైన ప్రదర్శన లక్ష్యం
- కామన్వెల్త్‌లో సీజన్ అత్యుత్తమ త్రో నమోదు

**గ్లాస్గో, ఆగస్టు 1**

కామన్వెల్త్ గేమ్స్-2026లో రజత పతకం సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తన ప్రదర్శన వెనుక ఉన్న మానసిక ఒత్తిడిని వెల్లడించాడు. గాయం పూర్తిగా నయం కాకపోవడంతో ప్రతి త్రోకు ముందు ఆందోళన కలిగేదని, అయినప్పటికీ ఆ భయాన్ని అధిగమించి దేశానికి పతకం అందించడం సంతోషంగా ఉందని తెలిపాడు. పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ తన సీజన్‌లో అత్యుత్తమంగా 85.83 మీటర్లు విసిరి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగా పతిరాగే 89.75 మీటర్ల త్రోతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, మరో భారత అథ్లెట్ యశ్‌వీర్ సింగ్ 85.41 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో కాంస్య పతకాన్ని అందుకున్నాడు. పోటీ అనంతరం మాట్లాడిన నీరజ్ తన పునరాగమనం ఆశాజనకంగా సాగుతోందని పేర్కొన్నాడు. చలి వాతావరణంలో తన ఆటతీరు కొంత ప్రభావితమవుతుందని నవ్వుతూ చెప్పిన అతడు, మరోసారి పతకాల వేదికపై నిలవడం ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చిందన్నాడు. గత కొంతకాలంగా చేసిన కృషికి ఇప్పుడు ఫలితం కనిపిస్తోందని తెలిపాడు. గాయం కారణంగా ప్రతి ప్రయత్నంలోనూ శరీరాన్ని జాగ్రత్తగా నియంత్రించాల్సి వచ్చిందని నీరజ్ వివరించాడు. పూర్తిస్థాయి ఫిట్‌నెస్ ఉంటే మరింత ధైర్యంగా పోటీ పడగలమని, కానీ గాయం ఉన్నప్పుడు ప్రతి కదలికలోనూ అప్రమత్తంగా ఉండాల్సి వస్తుందని చెప్పాడు. వేగాన్ని అదుపులో ఉంచుకుంటూనే మంచి త్రో చేయడానికి ప్రయత్నించానని వెల్లడించాడు. ఫైనల్లో తనకు కూడా ఒక్క ప్రయత్నమే అత్యుత్తమంగా సఫలమైందని నీరజ్ తెలిపాడు. మిగతా త్రోలలో ఆశించిన ఫలితం రాలేదని, స్వర్ణ విజేత పతిరాగే కూడా ఒక అద్భుతమైన త్రోతోనే విజయాన్ని అందుకున్నాడని గుర్తుచేశాడు. ఇక ముందు జరిగే అంతర్జాతీయ పోటీల్లో పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వడమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు.



## అంతర్జాతీయ కబడ్డీ ప్లేయర్ భార్య ఆత్మహత్య

- వేధింపుల వల్లేనని ఆరోపణలు!

**'స్పోర్ట్స్ డెస్క్:**



అంతర్జాతీయ కబడ్డీ ప్లేయర్ భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన హరియాణాలో చోటుచేసుకుంది. కబడ్డీ ప్లేయర్ షీలు బల్హారా భార్య ముస్కాన్ (23) బలవన్మరణానికి పాల్పడింది. రోహ్‌తక్‌లోని మెహమ్ ప్రాంతానికి చెందిన ముస్కాన్(Muskan)కు 2023లో షీలుతో వివాహమైంది. గతేడాది వీరికి కుమారుడు జన్మించాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ముస్కాన్ ఆత్మహత్య చేసుకుంది.

**ఒక రోజు ముందు..**

ముస్కాన్ ఆత్మహత్యకు ముందు రోజు తన సోషల్ మీడియాలో పంజాబీ సాంగ్‌తో ఓ రీల్‌ను పోస్టు చేసింది. దీనికి, ఆత్మహత్యకు ఏమైనా సంబంధం ఉందా..? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముస్కాన్ కుటుంబ సభ్యులు మాత్రం వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకుందని ఆరోపిస్తూ షీలు (Sheelu Balhara) ఇంటి ముందు ఆందోళన చేశారు. బల్హారాతోపాటు అతడి కుటుంబ సభ్యుల నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నట్లు రోహ్‌తక్ ఎస్పీ గౌరవ్ రాజ్‌పురోహిత్ వెల్లడించారు.

## "సైనికుల త్యాగాలను మరిచావా?"..

- పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమాను కౌగిలించుకున్న జెమిమా.. ట్రోల్స్ వర్షం!

**లండన్, ఆగస్టు 1**






పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ ఫాతిమా సనాను భారత స్టార్ క్రికెటర్ జెమిమా రోడ్రిగ్స్ కౌగిలించుకుంది. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఒక్క ఘటనతో భారత స్టార్ క్రికెటర్ జెమిమా వివాదంలో చిక్కుకుంది. భారత్‌పాకిస్థాన్ దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ఆసియా కప్ 2025, టీ20 ప్రపంచకప్ 2026తో పాటు యు19, మహిళల మ్యాచ్‌లలో భారత ఆటగాళ్లు పాకిస్థాన్ క్రీడాకారులతో 'నోహ్యాండ్‌షేక్' విధానాన్ని పాటిస్తూ వస్తున్నారు. అయితే ది హండ్రెడ్ లీగ్‌లో జెమిమా, ఫాతిమాను ఆలింగనం చేసుకోవడంపై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. సౌతాంప్టన్ వేదికగా జరిగిన మ్యాచ్ ముగిశాక ఇద్దరూ ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ దృశ్యాలు నెట్టింట వైరల్ కావడంతో నెటిజన్ల మధ్య పెద్ద ఎత్తున వాదనలు మొదలయ్యాయి. "సైనికుల త్యాగాలను మరిచావా?" అంటూ తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. దేశ సైనికుల త్యాగాలను విస్మరించి ఇలా హద్దులు మీరడం సరికాదని కొందరు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, ఇది ఐసీసీ టోర్నమెంట్ కాదని, క్రీడలను రాజకీయాలతో ముడిపెట్టవద్దని మరి కొందరు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. విదేశీ లీగ్‌లలో ఇండియన్ యాజమాన్యాల ఫ్రాంచైజీలు పాక్ ప్లేయర్లపై నిషేధం విధించవచ్చనే ప్రచారం జరిగినప్పటికీ, సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు పాకిస్థాన్ ప్లేయర్ అబ్రార్ అహ్మద్‌ను ఎంపిక చేయడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ సైతం తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇక, ఇది బీసీసీఐ పరిధిలోని మ్యాచ్ కాకపోవడంతో జెమీమా నిబంధనలను పక్కనపెట్టి ఉండవచ్చని తెలుస్తోంది.

ఈ వివాదం పక్కన పెడితే, మైదానంలో జెమిమా తన అద్భుత ప్రదర్శనతో మెరిసింది. బర్మింగ్‌హామ్ ఫినిక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సదర్న్ బ్రేవ్ తరపున ఆడిన జెమిమా 18 బంతుల్లో 28 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడింది. దీంతో సదర్న్ బ్రేవ్ నిర్ణీత బంతుల్లో 140/3 భారీ స్కోరు సాధించింది. అనంతరం 141 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బర్మింగ్‌హామ్ ఫినిక్స్ జట్టుకు ఓపెనర్లు డావినా పెరిన్ (52), టామీ బ్యూమోంట్ (22) తొలి వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యాన్ని అందించి మంచి శుభారంభం ఇచ్చారు. అయితే ఈ జోడీ నిష్క్రమించిన తర్వాత బ్రేవ్ బౌలర్లు మ్యాచ్‌ను తమవైపు తిప్పుకున్నారు. లారెన్ బెల్, సారా గ్లెన్ వరుసగా వికెట్లు తీసి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టారు. కెప్టెన్ సోఫీ మోలినెక్స్ (2/24), లారెన్ బెల్ (1/16) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఫినిక్స్ జట్టు 116/5 పరుగులకే పరిమితమైంది. ఎల్లిస్ పెర్రీ 16 పరుగులతో, ఫాతిమా సనా 5 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. చివరికి సదర్న్ బ్రేవ్ 24 పరుగుల తేడాతో విజయం సాధించి, టోర్నీలో వరుసగా నాలుగో గెలుపుతో తమ విజయపరంపరను కొనసాగించింది.

## వైభవ్ సూర్యవంశీకి అసలైన పరీక్ష..

- సిక్సర్లు కొట్టడం కాదు.. ఇక నిలకడ ఆడాలి!

**స్పోర్ట్స్ డెస్క్:**



టీ20, వన్డే క్రికెట్‌లో (వైట్ బాల్) బౌలర్లకు దడపుట్టిస్తున్న యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి ఈ రాబోయే డొమెస్టిక్ సీజన్ అత్యంత కీలకంగా మారనుంది. రెడ్ బాల్ క్రికెట్ (డే మ్యాచ్) లో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన ఈ డాషింగ్ ఎడమచేతి వాటం ఓపెనర్‌కు అసలైన సవాల్ ఎదురు కానుంది. కేవలం సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడటమే కాకుండా సుదీర్ఘ సమయం క్రీజులో నిలబడి ఇన్నింగ్స్‌ను నిర్మించే సామర్థ్యం కూడా ఉందని నిరూపించుకోవాల్సిన సమయం వచ్చింది. భారత క్రికెట్‌లో సరికొత్త ఆశాకిరణంగా ఉద్భవించిన వైభవ్ సూర్యవంశీపై రాబోయే దులీప్ ట్రోఫీలో అందరి కళ్లు నిలిచాయి. సెలెక్టర్లు ఒక పెద్ద సాహసమే చేస్తూ ఏకంగా జట్టు వైస్ కెప్టెన్ బాధ్యతలను అప్పగించారు. రెడ్ బాల్ ఫార్మాట్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ టోర్నీలో వైభవ్ ప్రదర్శన అతని భవిష్యత్ టెస్టు కెరీర్‌ను నిర్దేశించనుంది.

**రంజీ ట్రోఫీలో సాగిన ప్రయాణం:**

బీహార్ తరఫున ఆడే వైభవ్ సూర్యవంశీ, జనవరి 2024లో ముంబైపై కేవలం 12 ఏళ్ల చిన్న వయస్సులోనే రంజీ డెబ్యూ చేసి చరిత్ర సృష్టించాడు. అయితే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇప్పటివరకు అతని ప్రయాణం అంత సాఫీగా సాగలేదు. రెడ్ బాల్‌ను ఎదుర్కొంటూ క్రీజులో నిలదొక్కుకోవడానికి అతను తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రంజీ ట్రోఫీలో మేఘాలయపై చేసిన 93 పరుగులే అతని అత్యధిక స్కోరు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో సెంచరీ సాధించలేదు. ఆడిన 8 రంజీ మ్యాచ్‌లలో కేవలం 17.25 సగటుతో 207 పరుగులు మాత్రమే చేశాడు. రంజీల్లో తక్కువ సగటుతో ఇబ్బంది పడుతున్నప్పటికీ, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో (వన్డేలు, టీ20లు) మాత్రం వైభవ్ బ్యాట్ నిప్పులు చెరుగుతోంది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్, 16 మ్యాచ్‌లలో 237.30 భారీ స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు సాధించి 'ఆరెంజ్ క్యాప్' దక్కించుకున్నాడు. ఇప్పటికే టీమిండియా తరఫున టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన అతను, లిస్ట్‌ఏ (వన్డే) మ్యాచ్‌లలో కూడా 43.88 సగటుతో 564 పరుగులు సాధించాడు.

**రెడ్ బాల్ ఎందుకు అసలైన పరీక్ష?**

చిన్న ఫార్మాట్‌లలో పరుగులు సాధించడం వైభవ్‌కు వెన్నతో పెట్టిన విద్య. కానీ ఐదు రోజుల సుదీర్ఘ మ్యాచ్ పూర్తిగా భిన్నమైన మానసిక పరిపక్వతను కోరుకుంటుంది. దులీప్ ట్రోఫీలో దేశంలోనే అత్యుత్తమ, అనుభవజ్ఞులైన పేసర్లు నిలకడైన లైన్ అండ్ లెంగ్త్‌తో దాడి చేయనున్నారు. ఇక్కడ వైభవ్ తన సహజ సిద్ధమైన దూకుడును కాస్త తగ్గించుకుని, జాగ్రత్తగా ఆడుతూ క్రీజులో ఎక్కువ సమయం గడిపే సహనాన్ని చూపించాల్సి ఉంటుంది. ఇక, వైభవ్ సూర్యవంశీకి ఈ దులీప్ ట్రోఫీ కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాదు, అతని టెస్టు కెరీర్‌కు అతిపెద్ద 'టర్నింగ్ పాయింట్'. వైస్ కెప్టెన్సీ బాధ్యతల ఒత్తిడి, నిరూపించుకోవాలనే కసి అతనిలోని అసలైన రెడ్ బాల్ క్రికెటర్‌ను బయటకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇక్కడ గనుక కొన్ని భారీ, మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌లు ఆడితే, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అతని పాత రికార్డులు వెనక్కి పోయి, భారత టెస్టు జట్టులో చోటు కోసం అతని దావా అత్యంత బలంగా మారుతుంది.

## ప్రీతి పంచ్‌లకు కెనడా బాక్సర్ చిత్తు..

- కామన్వెల్త్ లో భారత్‌కు స్వర్ణం
- మహిళల 54 కేజీల విభాగంలో ఏకపక్ష విజయం
- ఫైనల్లో డెల్గాడోపై 5-0తో ఆధిపత్య ప్రదర్శన
- నాక్‌డౌన్‌తో ఆకట్టుకున్న భారత బాక్సర్
- భారత్ పతకాల సంఖ్య 24కు చేరిక

**గ్లాస్గో, ఆగస్టు 1**



కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత బాక్సర్ ప్రీతి స్వర్ణ పతకం సాధించి దేశానికి మరో గర్వకారణంగా నిలిచింది. మహిళల 54 కేజీల బాక్సింగ్ విభాగం ఫైనల్లో కెనడాకు చెందిన ఎస్.ఎస్. డెల్గాడోపై 50తో ఘన విజయం సాధించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. పోటీ ఆరంభం నుంచే ప్రీతి పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. పదునైన పంచ్‌లు, చురుకైన కదలికలతో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టింది. మూడు రౌండ్లలోనూ ఐదుగురు జడ్జిలు 109 చొప్పున ప్రీతికే పాయింట్లు కేటాయించడంతో ఆమె ప్రదర్శన ఎంత ఏకపక్షంగా సాగిందో స్పష్టమైంది. పోరు మధ్యలో డెల్గాడోను ఒకసారి నాక్‌డౌన్ చేయడం కూడా మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దూకుడైన ఆటతీరుతో పాటు వ్యూహాత్మకంగా అవకాశాలను వినియోగించుకున్న ప్రీతి ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇవ్వలేదు. ఫుట్‌వర్క్, కాంబినేషన్ పంచ్‌లతో ప్రతి రౌండ్‌లోనూ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ స్వర్ణ పతకాన్ని ఖాయం చేసుకుంది. ఈ విజయంతో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల సంఖ్య 24కు చేరింది. ఇప్పటివరకు భారత్ ఖాతాలో 6 స్వర్ణాలు, 12 రజతాలు, 6 కాంస్య పతకాలు చేరగా, పతకాల పట్టికలో తొమ్మిదో స్థానానికి చేరుకుంది. బాక్సింగ్‌లో భారత క్రీడాకారుల నిలకడైన ప్రదర్శన కొనసాగుతుండగా, ప్రీతి స్వర్ణ విజయం భారత జట్టుకు మరింత ఉత్సాహాన్ని నింపింది.

## తండ్రి చనిపోయి 7 నెలలు...
## కూతురు తెచ్చిన గోల్డ్ దేశాన్నే కదిలించింది!

**స్పోర్ట్స్ డెస్క్ :**



ఒక చిన్న మట్టి ఇల్లు... రోజంతా సైకిళ్లు బాగు చేస్తే వచ్చే మూడు వందల రూపాయలు... అంతే ఆ కుటుంబానికి ప్రపంచం. కానీ ఆ తండ్రి కళ్లలో మాత్రం తన కూతురి కోసం కోట్ల విలువ చేసే ఒక కల ఉండేది. ఆ కల పేరు అస్మితా దే. ఆ తండ్రి కూతురు మెడలో బంగారు పతకం చూడాలని జీవితమంతా పోరాడాడు. కానీ విధి మాత్రం ఆ రోజు వచ్చే వరకు అతన్ని బతకనివ్వలేదు.

త్రిపురలోని ఓ చిన్న గ్రామానికి చెందిన అస్మితా దే...కామన్వెల్త్ గేమ్స్ మహిళల 48 కిలోల జూడో విభాగంలో బంగారు పతకం గెలిచి చరిత్ర సృష్టించింది. కామన్వెల్త్ గేమ్స్‌లో జూడోలో భారత్‌కు తొలి స్వర్ణ పతకం అందించిన క్రీడాకారిణిగా నిలిచింది. కానీ ఆ విజయాన్ని చెప్పాలని ఆమె ఎక్కువగా కోరుకున్న వ్యక్తి... ఈ లోకంలో లేడు.

ఏడు నెలల క్రితం ఆమె తండ్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించాడు. రోజుకు కేవలం మూడు వందల రూపాయలు సంపాదించే సైకిల్ మెకానిక్. అయినా తన కూతురి కలలకు ఎప్పుడూ పేదరికం అడ్డుగా నిలవనివ్వలేదు. మోకాలి గాయం వల్ల కెరీర్ ప్రమాదంలో పడినప్పుడు, తన దగ్గర ఉన్నదంతా ఖర్చు చేసి ఢిల్లీకి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. మందులు కొనిపెట్టాడు. తన కూతురు మళ్లీ జూడో మ్యాట్‌పై నిలబడాలని చివరి వరకు పోరాడాడు. కానీ తండ్రి మరణంతో అస్మితా ప్రపంచమే కూలిపోయింది. తనకు అండగా నిలిచిన మనిషి లేకపోవడంతో తన కల కూడా ముగిసిపోయిందని అనుకుంది.

అలాంటి సమయంలో తల్లి చెప్పిన ఒక్క మాట ఆమె జీవితాన్ని మళ్లీ నిలబెట్టింది. అంత్యక్రియలు జరిగిన పది రోజులకే... "నిన్ను ఈరోజు ఆపితే నీ నాన్న కలను నేనే చంపినట్టవుతుంది. మళ్లీ ప్రాక్టీస్‌కు వెళ్లు" అని ధైర్యం చెప్పింది. ఆ మాటలతో అస్మితా భోపాల్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్రానికి తిరిగి వెళ్లింది. కామన్వెల్త్ గేమ్స్ దగ్గరపడే కొద్దీ ఆందోళన పెరిగింది. ఎన్నో రాత్రులు నిద్రపట్టలేదు. తెల్లవారుజామున ఐదున్నరకే లేచి సాధనకు వెళ్లేది. తమ్ముడు ఎంతో ఇష్టంగా తీసుకొచ్చిన 'లౌంగ్ లట్టా' అనే స్వీట్ ఫ్రిజ్‌లో కనిపించిన ప్రతిసారీ తినాలనిపించినా... లక్ష్యం గుర్తుకొచ్చి తన కోరికను అదుపు చేసుకుంది. చివరకు ఆ త్యాగాలన్నీ ఒక్క బంగారు పతకంగా మారాయి. కామన్వెల్త్ గేమ్స్ వేదికపై స్వర్ణం గెలిచిన ఆ క్షణంలో... భారత జూడో చరిత్ర కొత్త అధ్యాయం ప్రారంభమైంది. కానీ ఆ మెడల్ మెరుపు వెనుక కనిపించని మరో బంగారం ఉంది. అది ఒక పేద తండ్రి నమ్మకం... ఒక తల్లి ధైర్యం... ఒక కూతురు వదులుకోని కల. కొన్నిసార్లు చరిత్రను రాసేది డబ్బు కాదు... తల్లిదండ్రుల త్యాగం, పిల్లల పట్టుదల. అదే అస్మితా దే కథ.

## పాకిస్థాన్‌తో తలపడనున్న ఇండియా..

- హై-వోల్టేజ్ పోరుకు వేళాయె..
- నేడు ఏషియన్ లెజెండ్స్ లీగ్-2026 లీగ్ లో దాయాది జట్టుతో పోరు


**స్పోర్ట్స్, డెస్క్ :**

ఏషియన్ లెజెండ్స్ లీగ్ 2026 టోర్నీలో భాగంగా ఆగస్టు 2, ఆదివారం నాడు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్, పాకిస్థాన్ సమరం జరగనుంది. ఇండియన్ రాయల్స్, పాకిస్థాన్ పాంథర్స్ జట్ల మధ్య జరిగే ఈ ఆరో మ్యాచ్ జాంబియాలోని లుసాకాలో ఉన్న లోటస్ స్పోర్ట్స్ క్లబ్ గ్రౌండ్‌లో జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఈ హైవోల్టేజ్ పోరు సాయంత్రం 4:00 గంటలకు ప్రారంభమవుతుంది. క్రికెట్ ప్రేమికులు ఈ మ్యాచ్‌ను టీవీలో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానళ్లలో, అలాగే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించవచ్చు. ఇండియన్ రాయల్స్ జట్టు శిఖర్ ధావన్ కెప్టెన్సీలో దినేష్ కార్తీక్, సురేష్ రైనా, హర్భజన్ సింగ్, యూసుఫ్ పఠాన్, అంబటి రాయుడు, రిషి ధావన్, స్టువర్ట్ బిన్నీ వంటి నక్షత్ర స్థాయి ఆటగాళ్లతో ఎంతో బలంగా మైదానంలోకి దిగుతోంది. తమ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టైగర్స్ జట్టును 19 పరుగుల తేడాతో ఓడించి ఇండియన్ రాయల్స్ విజయంతో బోణీ కొట్టింది. మరోవైపు.. మహమ్మద్ హఫీజ్ సారథ్యంలో ఉమర్ అక్మల్, షోయబ్ మాలిక్, వహాబ్ రియాజ్, సోహైల్ తన్వీర్, సైద్ అజ్మల్ వంటి వెటరన్ ఆటగాళ్లతో కూడిన పాకిస్థాన్ పాంథర్స్ జట్టు తమ మొదటి మ్యాచ్‌లో ఏషియన్ స్టార్స్ చేతిలో 85 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది. దీంతో ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి టోర్నీలో తిరిగి పుంజుకోవాలని పాకిస్థాన్ జట్టు తీవ్రంగా శ్రమిస్తోంది. ఆసియా ఖండానికి చెందిన రిటైర్డ్ దిగ్గజ క్రికెటర్లు పాల్గొంటున్న ఏషియన్ లెజెండ్స్ లీగ్ సీజన్2 జూలై 30న ప్రారంభమై ఆగస్టు 10న ముగియనుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 19 టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. మైదానంలో మళ్లీ పాత రోజులను గుర్తుచేస్తూ తలపడనున్న భారత్‌పాకిస్థాన్ జట్ల పోరు ఈ లీగ్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండటంతో ఇరు దేశాల అభిమానులలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



# పెళ్లి చుట్టూ సాగే కథతో క్రేజీ కల్యాణం

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'క్రేజీ కల్యాణం'. భద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను శనివారం చిత్ర యూనిట్ విడుదల చేసింది. నవ్వులు, భావోద్వేగాలు, ఊహించని మలుపులతో కూడిన ఈ టీజర్, ఒక పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు అందిస్తామని హామీ ఇస్తోంది. టీజర్ ప్రారంభంలో.. తండ్రి పాత్రలో నటిస్తున్న డాక్టర్ నరేశ్, తన కూతురు కీర్తి (అనుపమ) పెళ్లిని ఎంత ఘనంగా చేయాలనుకుంటున్నారో ప్రేమగా చెబుతారు. "నీ పెళ్లిని అంగరంగ వైభవంగా జరిపిస్తా" అంటూ ఆయన చెప్పే మాటలు ఆకట్టుకుంటాయి. అయితే, తండ్రి ఆశలకు భిన్నంగా కీర్తికి వేరే ప్రణాళికలు ఉన్నట్టు తెలుస్తోంది. "నీ కొడుకు ఒక్కడే మొండివాడు అనుకుంటున్నావా? నాలోనూ అదే రక్తం ప్రవహిస్తోంది" అని నానమ్మతో అనుపమ చెప్పే డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. తన అన్నకు తన పెద్దల్లుడి కంటే దరిద్రుడైన అల్లుడు రావాలని నరేశ్ దేవుడికి మొక్కుకోవడం, మంచంపై పడుకున్న వ్యక్తిపై




అనుపమ కారం చల్లడం వంటి సన్నివేశాలు కడుపుబ్బ నవ్విస్తున్నాయి. మొత్తం మీద ఈ టీజర్ ఒక క్రేజీ వెడ్డింగ్ సెలబ్రేషన్‌ను తెరపై చూపిస్తుందనే అంచనాలను పెంచింది. ఈ చిత్రంతో భద్రప్ప గాజుల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యారో సినిమాస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాలో నరేశ్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్ ఉద్దేమరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సురేశ్ బొబ్బిలి సంగీతం అందిస్తుండగా, శ్యామ్ దూపాటి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# కొరియన్ కనకరాజు ట్రైలర్ విడుదల

వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితిక నాయక్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మూవీ ట్రైలర్‌ను విడుదల చేసింది. థ్రిల్, హాస్యం, హారర్ అంశాలను మేళవించి మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. సత్య కీలక పాత్ర పోషిస్తున్న ఈమూవీకి తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు మంచి ఆదరణ పొందగా, ట్రైలర్‌లో ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా యాక్షన్, హారర్ సన్నివేశాల్లో థమన్ సంగీతం సినిమాకు అదనపు బలంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్స్, సాంకేతిక నాణ్యత సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలియజేస్తున్నాయి.ఆగస్టు 7న




ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పటికే మంచి పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో కూడిన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

# జూలో రెండు జంతువులను దత్తత తీసుకున్న అన్నా కొణిదెల






ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) మరోసారి తన సేవా దృక్పథంతో ప్రశంసలు అందుకుంటున్నారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న ఆమె.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తనకున్న గౌరవాన్ని తరచూ పంచుకుంటూ అభిమానులకు మరింత చేరువవుతున్నారు.రష్యాలో జన్మించినప్పటికీ భారతీయ ఆచారాలను పాటిస్తూ పూజలు, పండుగలు, కుటుంబ వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో కనిపించే అన్నా కొణిదెలకు ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు ఆమె తీసుకున్న మరో నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. తాజాగా అన్నా కొణిదెల హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రెండు జంతువులను దత్తత తీసుకున్నారు. అందులో ఒకటి ఆసియా ఏనుగు, మరొకటి రాయల్ బెంగాల్ టైగర్. ఈ జంతువుల ఆహారం, వైద్య సంరక్షణతో పాటు ఇతర నిర్వహణ ఖర్చులను ఇకపై ఆమె భరిస్తారని సమాచారం. జూ పార్క్‌లో ఆయా జంతువుల వద్ద అన్నా కొణిదెల దత్తత తీసుకున్నట్లు ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇంతకుముందు పవన్ కళ్యాణ్ కూడా విశాఖపట్నం జూలో జిరాఫీలను దత్తత తీసుకుని జంతు సంరక్షణకు తన వంతు సహకారం అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో అన్నా కొణిదెల కూడా ముందుకు రావడం అభిమానులను ఆకట్టుకుంటోంది.




# టాక్సిక్ ట్రైలర్ 8న గ్రాండ్‌గా విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్‌ను వచ్చే ఆగస్టు 8 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ (మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.



Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# నియోజకవర్గ సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు
- ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకునేందుకే 'డయల్ యువర్ ఎమ్మెల్యే'



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** సిర్పూర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొ ని 37 మంది ద్వారా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం లభించిందని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సలుగుపల్లి–పెంచికల్పేట్ రహదారి నిర్మాణంతో పాటు బెజ్జూర్–సోమిని మధ్య రెండు వంతెనల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు సాధించడం పెద్ద సవాలుగా మారిందన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అనుమతులు పొందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల సమస్యలపై స్పందించారు. గత సంవత్సరం ఎలాంటి అవినీతికి తావులేకుండా 4వేల ఇళ్లకు మంజూరు పత్రాలు అందించామని తెలిపారు. వాటిలో అధిక శాతం ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పెన్షన్లు అందని అర్హుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.


# సత్తుపల్లిలో వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేయాలి

## విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సత్తుపల్లిలో వెల్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శనివారం సత్తుపల్లిలోని సంఘ భవనంలో సంఘ అధ్యక్షుడు కేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. సమావేశంలో సంఘ కార్యదర్శి ప్రకాశరావు వార్షిక నివేదికను, ఆర్థిక కార్యదర్శి జి.కృష్ణయ్య ఆర్థిక నివేదికను ప్రవేశ పెట్టారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కేంద్రం సత్తుపల్లికి సుమారు 80 కిలో మీటర్ల దూరంలో ఉండటంతో ఉద్యోగులు, పెన్షనర్లు వైద్య సేవలు పొందేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సత్తుపల్లి ఉప ఖజానా కార్యాలయ పరిధిలో వేలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నందున వారి సౌకర్యార్థం సత్తుపల్లిలోనే వెల్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన ఆరు డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ నివేదికను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో రామిశెట్టి సుబ్బారావు, అద్దంకి వెంకటరత్నం, ఎన్.నర్సయ్య, జి.కృష్ణయ్య, యోగానంద్, మహమూద్, కమలకుమారి, వాణి, సాంబశివరెడ్డి, బూరుగు దాసు, సుందరరావు, మధుసూదనరాజు తదితరులు పాల్గొ న్నారు.

# తొలి ఆరు నెలలు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషణ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** శిశువు జన్మించిన వెంటనే ముర్రుపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని, తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సత్యవతి, అమ్మపాలెం సర్పంచ్ పెద్దగొళ్ల ప్రసన్న అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలో ఐసీడీఎస్ వెంకటాపురం సెక్టార్ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణపురం, అమ్మపాలెం గ్రామాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ వసంతరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "డబ్బా పాలు వద్దు.. తల్లిపాలే ముద్దు" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అబ్బదాసరి రోజా, రాధారాణి, గోధుమ నాగేంద్ర, ఆయాలు వాణి, రోజారమణి, సెకండ్ ఏఎన్ఎం అరుణకుమారి, ఆశా వర్కర్ గౌడెల్లి లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొ న్నారు.

# మహారాష్ట్ర నుంచి గడ్డి మందుల అక్రమ రవాణా

- నలుగురు అరెస్ట్
- రూ.1.44 లక్షల విలువైన గడ్డి మందు స్వాధీనం: మంచిర్యాల డీసీపీ భాస్కర్



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఎలాంటి అనుమతులు లేకుండా మహారాష్ట్ర రాష్ట్రం నుంచి గడ్డి మందులను తెలంగాణలోకి అక్రమంగా తరలించి రైతులకు విక్రయించేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1.44 లక్షల విలువైన గడ్డి మందులు, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు మంచిర్యాల డీసీపీ ఎగ్గే భాస్కర్ తెలిపారు. శనివారం తాండూర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. అందవెల్లి గ్రామానికి చెందిన గుండ రాజు, బట్టుపల్లి గ్రామానికి చెందిన పార్వతి కిరణ్, వెంకటాపూర్ గ్రామానికి చెందిన రుకుం వెంకటేష్, పల్లె రవీందర్‌లు మహారాష్ట్ర నుంచి గడ్డి మందులను అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో భీమిని ఎస్సై కోటేశ్వర్ తన సిబ్బందితో కలిసి రాంపూర్ గ్రామ శివారులోని ఎక్స్‌రోడ్ వద్ద తనిఖీలు నిర్వహించగా, టయోటా ఇన్నోవా కారుతో పాటు వెంకటాపూర్ పరిసరాల్లో ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న గడ్డి మందుల ప్లాస్టిక్ క్యాన్లు, ప్యాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణలో నిందితులు మహారాష్ట్రలోని రాజురా పట్టణం నుంచి ఈ గడ్డి మందులను కొనుగోలు చేసి భీమిని మండల పరిధిలో రైతులకు అక్రమంగా విక్రయించేందుకు తీసుకొస్తున్నట్లు అంగీకరించినట్లు డీసీపీ తెలిపారు. గ్లైఫోసేట్ వంటి గడ్డి మందుల వాడకంతో భూమి సారవంతం తగ్గిపోవడం, పంట దిగుబడులు తగ్గడం, పర్యావరణానికి హాని కలగడంతో పాటు రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు ప్రభుత్వం అనుమతించిన, లైసెన్సు కలిగిన ఎరువులు, పురుగు మందుల దుకాణాల నుంచే మందులు కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. అలాగే దళారుల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఎవరైనా అనుమతులు లేకుండా గడ్డి మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ సమావేశంలో టాస్కోఫోర్స్ ఏసీపీ బి.శ్రీనివాస్‌రావు, తాండూర్ సీఐ దేవయ్య, భీమిని ఎస్సై కోటేశ్వర్, టాస్క్ ఫోర్స్ ఎస్సైలు దీకొండ రమేష్, లక్ష్మణ్‌రావు, సిబ్బంది లవన్, రాజేందర్, మట్ట రమేష్, మైకాంత్, నీలిగొండ అంజయ్య, ముస్తఫా, రమేష్, కిరణ్, సుబ్బారావు తదితరులు

# ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఆటో కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబ్ పాషా అన్నారు. తాండూర్ మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవ వేడుకలను శనివారం మండల కేంద్రంలోని ఐబీ ప్రాంగణంలో నిర్వహించారు. ఆటో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించుకునే పరిస్థితి కూడా లేకపోవడంతో, ఆటో కార్మికులే చందాలు సేకరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహాలక్ష్మి పథకం కారణంగా నష్టపోతున్న ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఏడాదికి రూ.12వేల గౌరవ వేతనం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీలు అమలు కాలేదని పేర్కొన్నారు. మరణించిన 205 మంది ఆటో కార్మికుల కుటుంబాలను కూడా ప్రభుత్వం పరామర్శించలేదని అన్నారు. ఇటీవల ఈవీ ఆటోల ద్వారా "ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్" సేవల కోసం ప్రైవేట్ అగ్రిగేటర్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవీ ఆటోలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వస్తే వేలాది ఆటో కార్మికుల జీవితం సంక్షోభంలో పడుతుందన్నారు. రాష్ట్రంలోని ఆటో కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండలానికి చెందిన ఆటో కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొ న్నారు.

# పార్టీ బలోపేతమే ధ్యేయం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస రెడ్డి
- జిల్లా కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ తొలి సమావేశం
- సంక్షేమ పథకాల అమలుపై సుదీర్ఘ చర్చ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పార్టీ బలోపేతమే ధ్యేయంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నియమించిన పొలిటికల్ అఫైర్స్ కమిటీతొలి సమావేశం జిల్లా కేంద్రంలోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. నూతన డీసీసీ కార్యాలయ నిర్మాణం, మండల కమిటీల ఏర్పాటు, పార్టీ సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనథ్-బేలా సంయుక్త మార్కెట్ కమిటీ నుంచి బేలను విడదీసి ప్రత్యేక మార్కెట్ కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో ప్రతిపాదించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసి నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను స్థానిక ఎమ్మెల్యే తన ఖాతాలో వేసుకోవడం సరికాదని, 'ఇందిరమ్మ' అంటేనే కాంగ్రెస్ పార్టీ గుర్తుకు వస్తుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు ఉన్నత విద్య కోసం హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీంతో పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ శివారులోని 800 ఎకరాల ప్రభుత్వ భూమిలో యూనివర్సిటీ, జేఎన్‌టీయూ కళాశాల ఏర్పాటు చేయాలని పీఏసీ తీర్మానించిందని తెలిపారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. బోథ్ నియోజకవర్గానికి వరప్రదాయినిగా భావిస్తున్న కుప్టి ప్రాజెక్టు జీఓ నంబర్లు 18, 34లను సవరించి నీటి నిల్వ సామర్థ్యాన్ని 6.5 టీఎంసీలకు పెంచి సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీతో పాటు సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను భాగస్వాములను చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. అలాగే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణ కోసం ప్రజా ప్రభుత్వం రూ. 2వేల కోట్లు కేటాయించిందని, ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే లైన్ నిర్మాణానికి సహకరిస్తోందని అన్నారు. ఈ సమావేశంలో పీఏసీ సభ్యులు మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆడే గజేందర్, మల్లెపూల నర్సయ్య, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, సాజిద్ ఖాన్, అల్లూరి సంజీవరెడ్డి, దిగంబర్ రావు పాటిల్, మల్లెపూల సత్యనారాయణ, అల్లూరి అశోక్ రెడ్డి, కొంరం కోటేష్, బండారి అనూష సతీష్, అడ్డి భోజా రెడ్డి, ముడుపు దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి

- సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట ఐఎన్టీయూసీ మహాధర్నా







**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లిలోని సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట శనివారం ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. మణుగూరు డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఐఎన్టీయూసీ నాయకులు తీగల క్రాంతికుమార్, బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, జేవీఆర్ సీహెచ్‌పీ, జేవీఆర్ డిస్పెన్సరీ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీగల క్రాంతికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న బొగ్గు బ్లాక్‌ల వేలంలో మణుగూరు డిప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సింగరేణి జీఎం చింతల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. బి. కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సింగరేణి వెన్నెముకగా నిలుస్తోందని అన్నారు. 137 సంవత్సరాల అనుభవంతో బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బొగ్గు బ్లాక్‌లను సింగ రేణికే కేటాయించాలని కోరారు. తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి ద్వారా నిర్వహిస్తే స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గతంలో ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన కొన్ని బొగ్గు బ్లాక్‌లలో ఇప్పటివరకు మైనింగ్ ప్రారంభం కాలేదని గుర్తుచేశారు. సింగరేణి అనుభవం, సాంకేతిక సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు నాగ ప్రకాష్, మురళీకృష్ణ, షట్రక్ బాబు, పొట్టి కిరణ్, సుదర్శన్, నజీర్, యశ్వంత్ రెడ్డి, వేణునాథ్, సీతారామరాజు, షణ్ముఖచారి, నాగేష్, నాగేశ్వరరావు తదితరులు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొ న్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక








# ఎస్ఆర్ డిజి స్కూల్‌లో ఘనంగా ఆషాఢ బోనాలు

- **సాంప్రదాయ దుస్తు ల్లో విద్యార్థుల సందడి**
- **ఆకట్టు కున్న పోతరాజుల నృత్యాలు**

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన ఆషాఢ బోనాల పండుగను కరీంనగర్ అశోక్ నగర్‌లోని ఎస్ఆర్ డిజి స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. పచ్చని తోరణాలతో అలంకరించిన పాఠశాల ఆవరణలో విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. విద్యార్థులు బోనం, మట్టి కుండలను అందంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ స్కూల్స్ డీజీఎం సచిన్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం ప్రిన్సిపాల్ మానస మాట్లాడుతూ ఆషాఢ మాసం అమ్మవారికి ఎంతో ప్రత్యేకమైనదని, బోనాల పండుగ తెలంగాణ మట్టి వాసనను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. వేడుకల్లో విద్యార్థుల వేషాధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు మహాకాళి అమ్మవారు, పోతరాజుల వేషధారణల్లో ప్రదర్శనలు ఇచ్చారు. పోతరాజుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.







# రాష్ట్ర మంత్రి ఉత్త ంకు స్వాగతం పలికిన కలెక్ట ర్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** భారీ వర్షాల నేపథ్యంలో శ్రీపాద ఎల్ల ంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న నీటిమట్టం, ప్రాజెక్టు సామర్థ్యాన్ని పరిశీలించేందుకు శనివారం రాష్ట్ర నీటిపారుదల, ఆహార-పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మంచిర్యాల జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ఇతర అధికారులు కలిసి రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంత్రికి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని వర్షా ల పరిస్థితులు, శ్రీపాద ఎల్ల ంపల్లి ప్రాజెక్టు నీటిమట్టం, నిర్వహణ అంశాలపై అధికారులతో సమీక్షించారు.

# చిన్నారుల భద్రత ప్రతిఒక్కరి బాధ్యత

**జిల్లా ప్రధానన్యాయమూర్తి వీరయ్య**

**బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన అవసరం**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** బాలల హక్కుల పరిరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య అన్నారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, పోక్సో చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాలల హక్కులు, చట్టాలపై పిల్లలకు, తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సోషల్ మీడియా ప్రభావంతో చిన్నారులు దారి తప్పకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా పిల్లలను తీర్చిదిద్దాలని కోరారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించాలని, గుడ్ టచ్–బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించాలని అన్నారు. బాల కార్మికులను గుర్తించి వారికి విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డీసీపీ ఎ.భాస్కర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందని, బాలల హక్కుల పరిరక్షణలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని అన్నారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాల ద్వారా బాలికలు, బాధితులకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, న్యాయమూర్తులు రామ్ మోహన్ రెడ్డి, కె.నిరోషా, అధికారులు, బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు, మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా ం

- **బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**
- **సావర్గాంలో రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవనం ప్రారంభం**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:**
గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని సావర్గాం గ్రామంలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని గ్రామ సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేరడిగొండ మండలంలోనే మొట్టమొదటి మహిళా సంఘ భవనం సావర్గాంలో పూర్తవడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, సర్పంచులు చురుకుగా పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. సావర్గా ం గ్రామం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇతర గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం ఇంకుడు గుంతలు నిర్మించుకుని ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.